ప్రజాశక్తి

శుక్రవారం 24 జనవరి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

'వాల్తేరు'పై ఇంకా సందిగ్ధమే!

- రైల్వే జోన్ ఆపరేషన్స్‌కు ఇంకా రెండేళ్ల సమయం
- కొత్త డిఆర్ఎం నియామకంలో కొనసాగుతున్న జాప్యం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వాల్తేరు రైల్వే డివిజన్‌పై ప్రభుత్వ స్థాయిలో చర్చే జరగకపోవడం గమనార్హం. ఈ నెల 8న విశాఖలో ప్రధాని మోడీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆధ్వర్యాన జరిగిన 'కూటమి' సభలో రైల్వేజోన్‌కు పునాదిరాయి పడిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వాల్తేరు రైల్వే డివిజన్‌పై ఎలాంటి ఊసూ లేదు. జోన్ కార్యకలాపాలు (ఆపరేషన్స్) మొదలు కావాలంటే మరో రెండేళ్ల సమయం పడుతుందన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఇప్పటికే 10 ఏళ్లుగా జోన్ ఆలస్యం అవుతూనే ఉంది. 2014 నుంచి కేంద్రంలో బిజెపి అధికారంలో ఉన్నా రైల్వేజోన్‌పై మాటలకే పరిమితమై ఎట్టకేలకు 2025లో వెల్లడించారు. వాల్తేరు రైల్వేపై మాత్రం గందరగోళం కొనసాగుతోంది. దేశంలోనే అత్యధిక ఆదాయాన్ని సంపాదించే వాల్తేరు రైల్వే డివిజన్‌కు ఆయువుపట్టుగా ఉండే కెకెలైన్ లేకుండా డివిజన్ ఉంచే అవకాశం ఉందంటూ ఒక వాదన, జోన్ కార్యకలాపాలు మొదలైతే డివిజన్ లేచిపోతుందంటూ మరో వాదన వాల్తేరు రైల్వే సిబ్బందిలో వినిపిస్తోంది. రూ.149.16 కోట్లతో రైల్వేజోన్ కార్యాలయం ఇతర పనులన్నిటికీ కేంద్రం ఆమోదించడం టెండర్లను సైతం పిలవడం తెలిసిందే. విశాఖలో 11 అంతస్థుల భారీ భవనాన్ని దక్షిణ కోస్తా రైల్వే జోన్ కోసం సిద్ధం చేసేందుకు ప్లాన్ కూడా తయారవుతోంది. ఇదంతా నిజమే అనుకున్నా సమయం పట్టడం ఖాయం. ఆపరేషన్స్ మొదలు కావాలంటే జోనల్ మేనేజర్‌ను కూడా నియమించాల్సి ఉంది. ఇదంతా కేంద్రం నుంచి రాష్ట్రంలోని కూటమి పార్టీలకు చెందిన తెలుగుదేశం, జనసేన ఒత్తిడి కూడా ఏ మాత్రం కనిపించడం లేదు.

వాల్తేరు డిఆర్ఎం సిబిఐకి చిక్కిన తర్వాత ?

2024 నవంబర్‌లో వాల్తేరు రైల్వే డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ముంబయిలో రూ.25లక్షలు లంచం తీసుకుంటూ సిబిఐకి చిక్కిన తర్వాత పోస్టుకు ఖాళీ ఏర్పడింది. ఈ పోస్టును ప్రస్తుతం ఎడిఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ (ఆపరేషన్స్) నిర్వహిస్తున్నారు. 1998 ఐఆర్‌టిఎస్ బ్యాచ్‌కు చెందిన లలిత్ బోహ్రాను వాల్తేరు రైల్వే డివిజన్‌కు నూతన డిఆర్ఎంగా నియమించినా ఆయన బాధ్యతలు చేపట్టలేదు. వాల్తేరు రైల్వే డివిజన్ ఉంటుందా? లేదా? సందిగ్ధం ఒకవైపు మరోవైపు డిఆర్ఎం పోస్టుకు ఛార్జ్ తీసుకోకపోవడంతో వాల్తేరు రైల్వే గురించిన చర్చ తాజాగా విశాఖ ఉద్యోగులు, సిబ్బందిలో నడుస్తుంది. రాయగడ డివిజన్‌కు మాత్రం డిఆర్ఎం జాయిన్ అయ్యారు. అక్కడ చకచకా అన్ని పనులు నడుస్తుండడం వెనుక బిజెపి సర్కారు ఉండడమేనని, ఇక్కడ కూటమిలో ఉన్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉద్యోగ, సిబ్బంది నుంచి సైతం వాల్తేరులో వినిపిస్తున్నాయి.

ప్ర'గతి'లేని ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు

- టెండర్లు పిలవక ఆగిన చందనాడ
- దొండవాకకు భూమి కొరత
- నిర్మాణాలపై శ్రద్ధ చూపని ప్రభుత్వం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని నక్కపల్లి మండలం చందనాడ వద్ద రూ.24.77 కోట్లతో నిర్మించాల్సిన ఫిష్ ల్యాండింగ్ పనులపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టడంలేదు. ఫిష్ ల్యాండింగ్ పనులకు గతంలో టెండర్లు పిలిచినప్పటికీ కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదు. కొత్త ధరల ప్రకారం సవరించి పనులకు టెండర్లు పిలవాల్సివుంది. ఆ పనిచేయకపోవంతో కాంట్రాక్టర్లు టెండర్లు వేయడానికి సుముఖత చూపడంలేదు. మత్స్యకారులకు దోహదపడే ల్యాండింగ్ సెంటర్‌కు మంజూరైన రూ.24.77 కోట్లలో కేంద్ర ప్రభుత్వం రూ.14.86, రాష్ట్ర ప్రభుత్వం రూ.9.91 కోట్లు ఇవ్వాల్సివుంది. అయితే గత రాష్ట్ర ప్రభుత్వం, కూటమి ప్రభుత్వమూ ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణంపై దక్షత చూపలేదు. ఔషధ, రసాయన కంపెనీలకు భూములు సేకరించి, మౌలిక సదుపాయలు కల్పనపై చూపుతున్న ఆత్రం మత్స్యకారుల ఫిష్ ల్యాండింగ్‌పై లేదు. ఇది పూర్తయితే సముద్రంలో చేపలవేటపై ఆధారపడి బతుకుతున్న నాలుగువేల మత్స్యకార కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందని మత్స్యశాఖాధికారులు చెబుతున్నారు. సముద్రానికి ఆనుకొని ఐదెకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణ పనులకు భూ సమస్య లేనప్పటికీ టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభించే పని ప్రభుత్వం చేయడంలేదు.

రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలోని రెండు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ పనుల్లో కదలికలేదు. చందనాడ ఫిష్ ల్యాండింగ్ సెంటర్ పనులకు టెండర్ పిలవక పనులు జరగకపోగా, రూ.25 కోట్ల ప్రతిపాదిత దొండవాక ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు భూ సమస్య ఉంది. ఇక్కడ ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోవడంతో మూడెకరాల ప్రయివేటు భూమి కొనుగోలు అనివార్యమైంది. భూమి కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వానికి నివేదించి సంవత్సరాలు గడుస్తున్నా, గ్రీన్ సిగ్నల్ రాలేదు. ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణ పనులు పూర్తయితే మత్స్యకారులకు మౌలిక సదుపాయాలు కలగనున్నాయి. సిసి రోడ్, ప్లాట్‌ఫాం, విద్యుత్ సదుపాయం, చేపల విక్రయ కేంద్రాలు, వలలు అల్లుకొనే గదులు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, చేపల నిల్వ కేంద్రాలు వంటి సదుపాయాలు లభించనున్నాయి. ఇక్కడ మిగతా 2లో..

కానిస్టేబుల్ ఫిజికల్ టెస్ట్‌లో అపశ్రుతి : అభ్యర్థి మృతి
▸ వార్త మెయిన్‌లో..

విశాఖ కేంద్ర కారాగారంలోకి ఖైనీ ప్యాకెట్లు
▸ వార్త 3లో..

పర్యాటక రంగంలో మోడల్ సిటీగా విశాఖ : అమ్రపాలి
▸ వార్త 8లో..

మెడికల్ ప్రీమియం పెంచొద్దని ధర్నా
▸ వార్త 4లో..

ఉద్యోగులు కాదు.. కూటమి నేతలే రాజీనామా చేయాలి

సిఐటియు

మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్, జగన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం రాజీనామాలు చేయవలసింది ఉద్యోగులు కాదని, అధికార కూటమి పార్టీ నాయకులే చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, కార్యదర్శి బి.జగన్ పేర్కొన్నారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, 'ఆశకు అంతు ఉండాలని, కేంద్రం ప్రకటించిన ఈ ప్యాకేజీ సరిపోకపోతే ఉద్యోగస్తులు రాజీనామాలు చేసి వెళ్లిపోవాలి' అని బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు చెప్పడం దుర్మార్గం అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడలేని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామాలు చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత 1400 రోజుల నుంచి కార్మికులు, ప్రజలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పోరాడుతున్నాయని, ఈ పోరాట ఫలితంగానే కేంద్రం ప్రభుత్వం, ఒక్క శాతం కూడా ప్రైవేట్ పరం చేయలేకపోయిందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు ప్యాకేజీ కావాలని కోరలేదన్నారు. కార్మికుల కోరిందల్లా స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించమని, లేకపోతే సెయిల్‌లో విలీనం చేయమని మాత్రమే కోరిన విషయాన్ని గుర్తించాలన్నారు.

బిజెపి నాయకులు పనిగట్టుకుని స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేస్తున్న పోరాటాన్ని అవహేళన చేయడం కాకుండా సంఘీభావం తెలపాలని హితవు పలికారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని గతంలో అనేకమంది ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామాలు చేశారని, 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతోనే తిరిగి నిలబెట్టుకుంటామన్నారు. ప్రజలను, ప్రజా పోరాటాలను అవహేళన చేసిన వారు చరిత్ర మిగతా 2లో..

కొనసాగిన బాలికల నిరసన

- పలు రాజకీయ, ప్రజా సంఘాల నేతలు పరామర్శ
- ఎట్టకేలకు ముగ్గురు విడుదలకు మార్గం సుగమం

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ వేలీ స్కూలు వద్ద ఉన్న ప్రభుత్వ ప్రత్యేక బాలికల గృహం వద్ద గురువారం మరోసారి ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. గృహం నుంచి విడుదలచేయాలని కోరుతూ కొంతమంది బాలికలు రెండు రోజులుగా చేస్తున్న ఆందోళన తారాస్థాయికి చేరుకుంది. రోడ్డుపై నిరసన తెలుపుతున్న బాలికల వద్దకు పలు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు వచ్చి పరామర్శించారు. బాలికలు చెబుతున్న విషయాలను తెలుసుకున్నారు. రెండు రోజులుగా అధికారులు జరుపుతున్న సంప్రదింపులు కారణంగా ఎట్టకేలకు ఐదుగురు బాలికలను బయటకు పంపేందుకు మార్గం సుగమం అయింది. గురువారం ఒక బాలిక తల్లితో పంపించేశారు. మరో ఇద్దరు బాలికలకు తల్లిదండ్రులు లేని కారణంగా ఎస్కార్ట్‌తో వేరే జిల్లాలోని గృహానికి పంపిస్తున్నారు. మిగిలిన ఇద్దరు బాలికలను శుక్రవారం వారి తల్లిదండ్రుల వద్దకు పంపించనున్నట్టు హోం పర్యవేక్షణాధికారి సునీత తెలిపారు.

గృహంలో నిర్వాహకులు తమకు మానసిక రోగుల పేరుతో మందులు ఇస్తున్నారని, తమకు స్వేచ్ఛ కల్పించాలని పరామర్శకు వచ్చిన వారితోను, మీడియా వద్ద బాలికలు చెప్పారు. బాలికలను హోం లోపలకు తీసుకెళ్లేందుకు నిర్వాహకులు చేసిన ప్రయత్నం ఫలించలేదు. తమను హోం నుంచి విడిచి పెడితే తప్ప ఇక్కడ నుంచి కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్త్రీ,శిశు సంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఐద్వా నాయకులు పి.మణి, ఎపి మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు విమల, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు రాధ, బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేశలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం బాలికల సమస్యలను తెలుసుకొని అధికారులతో, గృహం సిబ్బందితో మాట్లాడారు. తగిన పరిష్కారం చేయాలని అధికారులను కోరారు.

సమగ్ర విచారణ చేపట్టాలి - ఐద్వా

ప్రభుత్వ ప్రత్యేక బాలికల గృహంలో జరుగుతున్న పరిణామాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఐద్వా జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. హోంలో బాలికలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో గురువారం ఐద్వా నాయకులు పి.మణి, మౌనికలతో కూడిన ఐద్వా ప్రతినిధి బృంధం గరువారం బాలికలను కలిసి సమస్యలనడిగి తెలుసుకున్నారు. అనంతరం గృహం లోపల నిర్వాహకులను కలిసి మాట్లాడారు. అక్కడి పరిస్థితులను పరిశీలించారు. గృహంలో పరిస్థితులు చాలా దయనీయంగా ఉన్నాయని ఐద్వా నాయకులు చెప్పారు. వారి మానసిక పరిస్థితులు చాలా మిగతా 2లో..

మూఢనమ్మకాల నిర్మూలనకు చైతన్య క్యాంపులు

భారత నాస్తిక సమాజం విజ్ఞప్తి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : లంకె బిందెలు, గుప్త నిధులు, మహిమలు, మంత్రాలు బూటకమని, మూఢనమ్మకాల నిర్మూలనకై ప్రజలకు అవగాహన కల్పించడానికి చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, పోలీసు అధికారులకు భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు టి.శ్రీరామ్మూర్తి, జె.రవి కోరారు. విశాఖ జిల్లా ఆనందపురం మండలం, వేమగొట్టి పాలెంలో మహిమలు, మంత్రాలు, పూజలతో లంకెబిందెలు, గుప్త నిధులు లభిస్తాయని మోసం చేసిన నలుగురి నుంచి రూ.28 లక్షలు వసూలు చేసిన ముఠాను పోలీసులు వెంటనే అరెస్టు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలలో ఉన్న మూఢనమ్మకాలు, అతీంద్రియ శక్తులు, మంత్రాలు, మహిమలు ఆసరాగా చేసుకుని కొందరు నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఇవి బూటకమని, ప్రజలలో శాస్త్రీయ అవగాహన కల్పించుటకు మీడియా ద్వారా ప్రకటనలు, మండల కేంద్రాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించవలసిందిగా జిల్లా అధికారులను కోరారు. మూఢనమ్మకాల నిర్మూలన చట్టం చేయవలసిందిగా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

'21, 31 జిఒలు రద్దు చేయాలి'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆటో కార్మికులపై అధిక జరిమానాలు విధించే జిఒలు 21, 31లను రద్దుచేయాలని విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (ఎఐటియుసి) జిల్లా అధ్యక్షులు షేక్ రహమాన్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ కాసుబాబు డిమాండ్ చేశారు. టౌన్ కొత్త రోడ్డు శ్రీ దుర్గా గణపతి ఆటో స్టాండ్ సున్నపు వీధిలో 15 మంది ఆటో కార్మికులు గురువారం ఎఐటియుసిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో మోటార్ కార్మికులపై ఆర్థిక భారాలు పడే విధంగా 21, 31 జిఒలను తీసుకొచ్చి, వందల్లో ఉన్న ఫైన్‌ను వేలు, లక్షల్లోకి పెంచడంతో ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. భారీగా పెరిగిన ఆర్‌టిఎ చలానా చార్జీలను తగ్గించాలని, ఆటో కార్మికుల ఆదాయం పెరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మోటార్ డ్రైవర్‌కు మెడి క్లైమ్ రూ.5 లక్షలు, ప్రమాదంలో ఏ డ్రైవర్ అయినా చనిపోయినా రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, వారి కుటుంబానికి పిఎఫ్ వచ్చే విధంగా భద్రతతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.సత్యనారాయణ, జి.సతీష్, బి.వేణుగోపాల్, డి.జగ్గారావు, జి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ ప్రోగ్రామ్‌లో శిక్షణ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ ప్రోగ్రామ్ 8 భారతీయ రాష్ట్రాలలోని 272 జిల్లాల్లో 3 మిలియన్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, 20 వేల మందికిపైగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చిందని అమెజాన్ ఇండియా కంట్రీ మేనేజర్ సమీర్ కుమార్ తెలిపారు. విశాఖలోని వెల్‌కం గ్రాండ్ బే హోటల్‌లో జరిగిన అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ ప్రోగ్రామ్ 'కెరీర్స్ ఆఫ్ ది ఫ్యూచర్' సమ్మిట్ ప్రారంభ ఎడిషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ, సాంకేతిక రంగంలో లింగ అంతరాన్ని తగ్గించడానికి ఈ కార్యక్రమం రూపొందించినట్లు తెలిపారు. ప్రధానంగా టైర్ 2 నగరాల్లో నివసించే 6 అంతకంటే ఎక్కువ తరగతుల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని, హిందీ, ఇంగ్లీష్, తమిళం, తెలుగు, కన్నడ, ఒరియా, మరాఠీతో సహా ఏడు భారతీయ భాషలలో ఆకర్షణీయమైన, బహుభాషా అభ్యాస సామగ్రిని అందిస్తున్నట్లు చెప్పారు. సాంకేతికతలో యువతను మరింత శక్తివంతం చేయడానికి, అమెజాన్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ లేదా సంబంధిత రంగాలలో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు చదువుతున్న మహిళా విద్యార్థులకు నాలుగేళ్లలో ఒక్కొక్కరికి రూ. 2 లక్షల విలువైన 500 మెరిట్ ఆధారిత స్కాలర్‌షిప్‌ను అందించినట్లు చెప్పారు.

25, 26 తేదీల్లో రిపబ్లిక్ డే సంబరాలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ/ విశాఖ కలెక్టరేట్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురజాడ సాంస్కృతిక వేదిక, లిల్లీ వైట్స్ క్లబ్, చిన్నవాల్తేరు సంయుక్తంగా రిపబ్లిక్ డే సంబరాలను ఈ నెల 25, 26 తేదీల్లో లిల్లీ వైట్స్ క్లబ్బులో నిర్వహించనున్నామని నిర్వాహకులు దండు నాగేశ్వరరావు తెలిపారు. 25నఉదయం 9.30 గంటల నుంచి స్కూల్ పిల్లలకు దేశభక్తి అభ్యుదయ అంశాలపై పాటల పోటీలు, జనవరి 26వ తేదీ ఉదయం 9.00 గంటలకు లిల్లీ వైట్స్ క్లబ్‌లో సాంస్కృతిక కళారూపాలు, 10.00 గంటలకు పతాక ఆవిష్కరణ, సభ, అనంతరం విజేతలకు బహుమతులు, ఉంటాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే స్కూలు పిల్లలు పేర్లను ఫోన్, వాట్సాప్ ద్వారా దండు నాగేశ్వరరావు (9490750661), బొట్టా వేణుగోపాలరావు (9291224231)కు తెలియజేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

మొదటి పేజీ తరువాయి..

ప్ర'గతి' లేని ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు

చేపలు అమ్ముకోవడంతో పాటు చేపలు ఎండబెట్టుకొనేందుకు వీలుగా ప్లాట్‌ఫామ్ ఏర్పాటుచేయనున్నారు.

చందనాడ ఫిష్ ల్యాండింగ్ సెంటర్ పనులకు త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాద్ తెలిపారు. దొండవాక సెంటర్ నిర్మాణ పనుల నిమిత్తం ప్రయివేటు భూమి కొనుగోలుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సివుందన్నారు.

కొనసాగిన బాలికల నిరసన

దయనీయంగా ఉన్నాయన్నారు. వారి మానసిక అభివృద్ధికి ఉపయోగపడే విధంగా అక్కడ వాతావరణం లేదని తెలిపారు. ఏడు జిల్లాలకు ఒకే గృహం ఉండడం వల్ల కూడా సుదూర ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు బాలికలను చూసేందుకు కష్టం అవుతుందన్నారు. హోం లోపల అంతమందికి తగిన సదుపాయాలు లేవన్నారు. భోజనం చేసేందుకు తగిన సౌకర్యం లేదని తెలిపారు. తీవ్ర మానసిక ఇబ్బందులు, కష్టాలు, బాధలు ఎదుర్కొంటున్న ఈ బాలికల పట్ల ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపించాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాకు గృహం ఏర్పాటు చేయాలని, హోంలో పిల్లల చదువుకోవడానికి ఒక స్కూలు ఏర్పాటు చేయాలని, మానసిక ఇబ్బందులు ఎదుర్కోవడానికి అవసరమైన విధంగా సిలబస్‌ను, ప్రత్యేక టీచర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని వసతులతో కూడిన ఒక నూతన భవనం నిర్మించాలని, దీనిపై నిపుణుల సలహాలను తీసుకోవాలని సూచించారు. హోం మంత్రి అనిత బాలికల ప్రత్యేక హోమ్‌ను సందర్శించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

ఉద్యోగులు కాదు.. కూటమి నేతలే రాజీనామా చేయాలి

హీనులుగా మిగిలిపోతారన్నారు. ఇప్పటికైనా బిజెపి, కూటమి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించే విధంగా కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి చేయాలని కోరారు. కార్మికులను, పోరాటాలను అవహేళన చేసే ప్రకటనలు మానుకోవాలని హితవుపలికారు.

జర్నలిస్టులకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్టులకు అండగా ప్రభుత్వం ఉంటుందని, వారి సమస్యల పరిష్కారం పట్ల సానుకూలంగా ఉందని రాష్ట్ర సమాచార,పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంత్రి పార్థసారథిని విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సీనియర్ నాయకులు ధవళేశ్వరపు రవికుమార్, గొడబ రామారావు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన మంత్రి జర్నలిస్టులకు మేలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు మంత్రిని ఫెడరేషన్ నాయకులు దుశ్శాలువాతో సత్కరించారు.

టౌన్ ప్లానింగ్‌పై నేడు ఫిర్యాదులు స్వీకరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి పరిధిలో పట్టణ ప్రాంత ప్రణాళిక విభాగానికి సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులను శుక్రవారం స్వీకరిస్తున్నట్లు జివిఎంసి ఇన్ చార్జ్ కమిషనర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : మద్దిలపాలెంలోని కృష్ణా కాలేజీలో నైపుణ్యాభివృద్ధి , శిక్షణ శాఖ ఆధ్వర్యాన శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. ఈ జాబ్ మేళాలో టెక్విసేన్ సాఫ్ట్‌వేర్, డబ్ల్యుఎన్ఎస్, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, సంగీతా మొబైల్స్, పిబిఎల్ సర్వీసెస్ పాల్గొంటాయని పేర్కొన్నారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌కు సంబంధించి 2024లో ఇంటర్ ఎంపిసి, బైపిసి చేసి 18 నుంచి 20 సంవత్సరాలలోపు వారు అర్హులని తెలిపారు. టెక్విసేన్ సాఫ్ట్‌వేర్, పిబిఎల్ ట్రాన్స్‌పోర్టుకు సంబంధించి ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన యువతీయువకులు అర్హులని పేర్కొన్నారు. సంగీతా మొబైల్స్‌లో ఉద్యోగానికి పదవ తరగతి ఆపై చదివిన వారు అర్హులని తెలిపారు. ఉత్తరాంధ్రలోని నిరుద్యోగ యువతీ యువకులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నం, హైదరాబాద్‌లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9885694676 సంప్రదించాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్ ఉందని తెలిపారు. 19 నుంచి 30 సంవత్సరాలలోపు అభ్యర్థులు ఆధార్ నెంబర్, ఆధార్ అనుసంధానమైన ఫోన్ నెంబర్‌తో హాజరుకావాలని పేర్కొన్నారు.

మహారాజశ్రీ నర్సీపట్నం జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
I.A. 2/2022, O.S. 267/2022, లో

Between :
బైపల్లి అప్పారావు ....వాది.
మరియు
ముప్పిన రామకృష్ణ అండ్ ముప్పిన సతీష్ .... ప్రతివాది

టు.
1. ముప్పిన రామకృష్ణ s/o సత్తిబాబు, జోగింపేట, గొలుగొండ (మం) అనకాపల్లి జిల్లా.
2. ముప్పిన సతీష్ s/o సత్తిబాబు, జోగింపేట, గొలుగొండ (మం) అనకాపల్లి జిల్లా.

యీ నెంబరు దావా వాది పేరున మీరు తే: 12-11-2019 దిన వ్రాయించి యిచ్చిన ప్రాంసరీ నోటు తాలూకా అసలు వృద్ధులు రూ. 5,03,400=00 (అక్షరములా ఐదు లక్షల మూడు వేల రూపాయిలు) కును దావా ఖర్చులు దర్మిలా వడ్డీ రాబట్టే నిమిత్తం వాది పై నెంబరున మీపై దావా దాఖలు చేసియున్నారు. అందు విషయమై మీకు ఎట్టి ఆక్షేపణలు యున్ననూ **తేది. 11-02-2025 దికి ఉదయం 10-30 గంటలకు** పైకోర్టు వారి యెదుట హాజరైమనవి చేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు ఎక్స్ పార్టీ ఆర్డర్ జారీ కాబడునని యిందు మూలంగా మీకు తెలియపర్చడమైనది.

నర్సీపట్నం
తేది : 23-01-2025
కామిరెడ్డి సత్యనారాయణ
వాది తరపు అడ్వకేట్
సెల్ నెం. 7396732803

IN THE HON'BLE COURT OF THE VI ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) AT: VISAKHAPATNAM
O.S.126/2024

Between:
Sri Manthena Srinivasa Raju & another ...Plaintiffs
And:
Sri Pilli Satyavathi & 4 others ...Defendants

SUIT SUMMONS

To,
Defendant No.3:
Sri Vikas, MIG-1/264, Housing Board Colony, Pothina Mallayyapalem, Visakhapatnam.

That, you are the Defendant No.3 in the captioned suit, which has been filed by the plaintiffs against you and other defendants for permanent injunction, restraining you from interfering with their possession and enjoyment of the plaint schedule property. The above suit stands posted to **13-02-2025** for your appearance. You are therefore hereby called upon to appear either in person or through a duly instructed counsel, before the Hon'ble Court on **13-02-2025** by **10:30 A.M.**, failing which the above suit will be decided in your absence as ex-parte.

(By Order of the Hon'ble Court)
V.V. RAVI PRASAD & J.V. RAMA KRISHNA
Advocates
D.No.45-57-3/B, Narasimha Nagar, Visakhapatnam-530 024.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియ జేయునది ఏమనగా నా క్లయింటు అయిన విశాఖపట్నం నగరపాలక సంస్థ దాబాగార్డెన్స్ ఏరియా రఘువర్ష్ ఫ్లాట్ నెం. 32 కాపురస్తులు విశాఖపట్నం-20 పోస్టు చెరుకూరి రాధాకృష్ణ మూర్తి గారి కుమారుడు చెరుకూరి మురళిను అనామె నాకు ఇచ్చిన భోగట్టా పై యావన్మందికి తెలియజేయునది ఏమనగా

పైన తెలిపిన నా క్లయింటు 12-12-2024దిన ఆయన ఇంటి నుండి ఆటోనగర్ వైపు కారులో వస్తుండగా ఆటోనగర్ సమీపంలో తన కారును పార్కు చేసి వేరే ఆఫీస్‌కి వెళ్లి తిరిగి వచ్చి తన కారులో ఉన్న రిజిష్టర్ డాక్యుమెంటును చూసుకొనగా అదిపోయినది. సదరు డాక్యుమెంటు నెంబరు 159/1998 కావున పైన తెలిపిన డాక్యుమెంటు ఎవరికైనా దొరికినచో ఈక్రింది నెంబరుకు తెలియజేయగలరు.

షెడ్యూలు : విశాఖపట్నం జిల్లా విశాఖపట్నం నగర పాలక సంస్థ ఏరియా ద్వారకానగర్ సబురి మాధవధార గ్రామం దాఖలా నెం. 29/1బి ప్లాటు నెంబరు 27 తూర్పు భాగం ట్రయాంగిల్ బిట్ 70 చ॥గ॥ లేక 58.59 చ॥మీ॥
తూర్పు : 40 అడుగుల రోడ్డు
దక్షిణం : జి.సరోజినిగారి యిల్లు
పడమర : జి.సాంబశివరావుగారి స్థలం
ఉత్తరం : 20 అడుగుల రోడ్డు మరియు 40 అడుగుల రోడ్డు

నైదాన విజయకుమార్, న్యాయవాది, లలితానగర్, దాబాగార్డెన్, విశాఖపట్నం.
సెల్: 80746956600, 7659862010

మహారాజశ్రీ నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.A.No. 61 / 2024 & 44/2024 in E.P. 43/2019 O.S.No. 36/2009

పిటీషన్:
గవిరెడ్డి బెన్నయ్యనాయుడు ... పిటీషనరు
అండ్:
చిటికెల వెంకట రామచంద్రరావు వగైరాలు ... రెస్పాండెంట్లు

నోటీసు టు:
R-6 : శింగంపల్లి అప్పలనాయుడు, తండ్రి కన్నయ్యా, స్థిరనివాసం డో.నెం. 4-8-120/1, పుడాకాలనీ, రాజేంద్రనగర్, ఆత్మాపూర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ. ప్రస్తుత నివాసం డో.నెం.2-62 పూడి గ్రామం, రాంబిల్లి మండలం, అనకాపల్లి జిల్లా. ఆంధ్రప్రదేశ్.
R-7 : శింగంపల్లి కృష్ణవేణి, భర్త అప్పలనాయుడు, స్థిరనివాసం డో.నెం. 4-8-120/1, పుడాకాలనీ, రాజేంద్రనగర్, ఆత్మాపూర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ. ప్రస్తుత నివాసం డో.నెం.2-62 పూడి గ్రామం, రాంబిల్లి మండలం, అనకాపల్లి జిల్లా. ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు ఇ.పి.లో తే:9-5-2024దీని జప్తుంచిన కోర్టు సేల్ చెల్లదని మరియు రద్దు పర్చమని పిటీషనరు దాఖలు చేసిన పై నెంబరు EAsలో మీరు స్వయంగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని పై కోర్టు వారి యెదుట **తేది: 21-02-2025దీని ఉదయం 10-30 గ॥లకు** హాజరయి సంజాయిషి తెల్పుకొనుటకు వాయిదా అయివున్నది. లేనియెడల మీ పరోక్షమందు వ్యాజ్యము పరిష్కరింపబడును.

(పై ఆర్డర్)
ఎన్.ప్రశాంత్, టి.వాసంతి
పిటిషనరు తరపు న్యాయవాదులు

IN THE HONOURABLE COURT OF THE I ADDITIONAL DISTRICTCUM MACT JUDGE AT VIZIANAGARAM.
M.V.O.P. No. 113/2024

BETWEEN:
GantedaVijayalaxmi ....Petitioner
AND:
Gedda Chandra Sekhar and 5 others ....Respondents

Notice to the Respondent No. 3, 4 & 5

R3) Gantala Rajesh, S/o Ravana, Hindu, aged about 31 years, driver of Car bearing No.AP 31 ET 0484, residing at Door No.43-7-32, Flot No.403, Sri GeneshSaiKarthikeya Apartments, Railway new Colony, Visakhapatnam.
R4) B.Tarun Kumar, S/o Ashok Kuma, Hindu, aged about not known, owner of Car bearing No.AP 31 ET 0484, residing at Door No.43-7-32, Flot No.403, Sri GeneshSaiKarthikeya Apartments, Railway new Colony, Visakhapatnam. (owner as per Certificate of Registration)
R5) P.Lakshmi, W/o Sri Ramulu, Hindu, aged about not known, owner of Car bearing No.AP 31 ET 0484, residing at Door No.6-159/5, Shnarayanapuram Village, Vepagunta Mandal, Visakhapatnam District. (owner as per Insurance Policy Copy)

Hg. Date:12-02-2025

పైన తెలిపిన కేసులో పిటిషనర్ పైన తెలిపిన రెస్పాండెంట్స్‌పై పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు కేసులో పై కోర్టువారి నుండి రెస్పాండెంట్స్ 3,4 మరియు 5 అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు తీసుకొనందున మీకు నోటీసు నిమిత్తము శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము పై నెంబర్ కేసు తే 12-02-2025 దిన వాయిదా వున్నదని ఈ పత్రికాముఖంగా తెలియపరుస్తూ సదరు తేది అనగా **తే.12-02-2025దిన ఉదయం గ॥ 10.30 నిమిషాలకు** మీరు కానీ లేదా మీ తరపున వకీలు గారి ద్వారా కానీ పైకోర్టులో ప్రత్యక్షంగా హాజరు అయి మీతరపున వాదనలు విన్నవించుకోవలెను. లేని యెడల పైన తెలిపిన కేసులో మీపరోక్షముగా విచారించి తీర్మానించెదరని శ్రీకోర్టువారి ఉత్తర్వుల ప్రకారము ఈప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

// BY THE ORDER OF THE HONOURABLE COURT //
ఇట్లు
Ch. ప్రవీణ్‌రాజు
పిటిషనర్ తరపున న్యాయవాది,
విజయనగరం. Cell: 99668 96047.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన

మాట్లాడుతున్న ఎల్‌డిఎం శ్రీనివాస్

ప్రజాశక్తి-ఆనందపురం : మారుతున్న కాలంతో పాటు సమాజంలో ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ సేవలు, డిపాజిట్ ఖాతాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని ఎల్‌డిఎం శ్రీనివాస్ సూచించారు. గురువారం మండలంలో వివేకానంద జూనియర్ కళాశాలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషనల్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ సేవలు పట్ల పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని, నగదు లావాదేవీలు , వయవృద్ధులకు బ్యాంకింగ్ సౌకర్యం రిజర్వ్ బ్యాంక్ ఇటీవల కల్పించిన సదుపాయాలు డిపాజిట్ ఖాతాల అదనపు ప్రయోజనాల గురించి వివరించారు.కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ వి ఆంజనేయులు, అశోక్ కుమార్, వర్క్ షాప్ రిసోర్స్ పర్సన్స్ ఎస్ హరి, ఎస్ బాలకృష్ణ, కళాశాల డైరెక్టర్ ఈశ్వరరావు, ట్రైనర్స్ హేమంత్ రామ్ పాల్గొన్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 62వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీ శివ సాయి ఆలయంలో అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు మూలవిశాల నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధన ను తెలుగు యువత నేత పి.మౌర్యసింహ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఎంఎల్.నాయుడు, మజ్జి మాలినాయుడు, కమిటీ సభ్యులు సత్యనారాయణ (సాయిరామ్), రాము నాయుడు, మురళి, నాగరాజు, శేషగిరి రెడ్డి, గణేష్, పైడిరాజు, శివసాయి భక్తులు నీలం రాజు, నర్సింగరావు, గంగాధర్, సింగ్, శ్రీను, గణపతి, పరుశరామ్ పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాల ఆకస్మిక సందర్శన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 24వ వార్డు నెహ్రూ మున్సిపల్ స్కూల్‌ను విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. పిల్లలతో కాసేపు ముచ్చటించిన ఎంపీ, వారికి పాఠాలు కూడా చెప్పి, విద్యకు ఎంత ప్రాముఖ్యత వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన పద్ధతులు, ఉపాధ్యాయుల బోధన పద్ధతులపై మాట్లాడుతూ వారికి పలు సూచనలు చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా, ఎంపీ శ్రీభరత్ పిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు.కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ, ఉత్తర నియోజకవర్గ నాయకులు వెల్లంకి భరత్‌పాల్గొన్నారు.. ఎంపీ సందర్శన పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతి అక్షరం-ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
అనుభవం కలిగిన
సబ్ ఎడిటర్
కావలెను
ప్రజాశక్తి కార్యాలయం
ప్లాట్ నెం.3, జి.బ్లాక్, ఆటోనగర్, ఇండస్ట్రియల్ పార్క్,
వడ్లపూడి, ఎం.వి.వి.అపార్ట్‌మెంట్ ప్రక్కన
విశాఖపట్నం-530046
ఫోన్ : 9491570765

'ఉక్కు' పరిరక్షణ పోరాటంలో మీతోనే ఉంటా

సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ

మాట్లాడుతున్న సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటంలో మీ వెంటే ఉంటానని సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. గురువారం స్టీల్ సిఐటియు కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ప్యాకేజీతో సమస్య పరిష్కారం కాదని స్పష్టం చేశారు. ఈ కర్మాగారాన్ని భావితరాలకు ప్రభుత్వ రంగంగానే అందించడం కోసం పోరాటాన్ని కొనసాగిస్తున్నా మన్నారు. స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి సొంత గనులు కేటాయింపు తప్ప మరొక మార్గం లేదన్నారు. లేకుంటే సెయిల్‌లో విలీనం చేస్తే ముడి ఖనిజం ఖర్చులు బాగా తగ్గి ఇది లాభాల బాట పడుతుందన్నారు. ఉక్కు పరిశ్రమ విలువ పెరగాలంటే దీని భూములను పరిశ్రమకు బదలాయించడం ద్వారా కాపాడు కోవచ్చునన్నారు. అంతవరకు టాక్స్ హాలిడే ఇస్తే వడ్డీలు భారాలు తగ్గి ప్యాక్టరీ అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆ దిశగా ప్రభుత్వ ఆలోచనలను సాగించాలని దానికి కార్మిక వర్గం పెద్ద ఎత్తున ఐక్య ఉద్యమాలతో ఒత్తిడి చేయాలని పిలుపునిచ్చారు.తానూ ఆయా ఉద్యమాల్లో వెన్నంటే ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్య రామ్, అధ్యక్షులు వైటి దాస్, ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, స్టీల్ సిఐటియు నాయకులు కె గంగాధర్, మరిడయ్య, పుల్లారావు, పవన్, యువ కార్మికులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

జ్యోతి ప్రజ్వళన చేస్తున్న మల్లేశ్వరరావు

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరానికి చెందిన ఘంటసాల సుమధుర స్వరాలు సంగీత సంస్థ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన తెలుగు హిందీ సినీ సంగీత విభావరి అలరించింది. 'సిరిమల్లె నీవే విరిజల్లు కావే' శీర్షికన నిర్వహించిన ఈ విభావరిలో మేటి తెలుగు హిందీ చిత్రాలలో గీతాలను సీనియర్ గాయనీ గాయకులు ఆలపించి మెప్పించారు. సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి అధ్యక్షతన ఘంటసాల సంస్థ గౌరవ అధ్యక్షులు, బిసి, ఎస్‌సి,ఎస్‌టి మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి సంగీత విభావరి ప్రారంభించారు.కట్ట మల్లేశ్వరరావును సంస్థ అధ్యక్షురాలు ఎస్ రాజేశ్వరి, కార్యదర్శి పిబి ఖాన్ ఘనంగా సత్కరించారు. సీనియర్ గాయకులు నరసింహమూర్తి, పెమ్మరాజు, సాంబశివ రావు, కెవిఎల్ .రావు, నాగేశ్వరరావు, రామ నరసింహం, ఆంజనేయ రెడ్డి, జిలాని, గాయనీమణులు సివి రాజేశ్వరి, భాగ్యలక్ష్మి , ఎస్ రాజేశ్వరి, పి సత్యవతి, గంటి ఉష, తదితరులు సోలో, యుగళగీతాలతో అలరించారు. ఈ సందర్భంగా విశాఖలో కళాకారుల సంక్షేమానికి సంబంధించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహణకు సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బయ్యా శ్రీనివాస్, స్వరూప, మంజుల పాల్గొన్నారు.

ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృత్యువాతపై ఆందోళన

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి, విశాఖ తీరంలో సముద్ర జలాల్లో ఇటీవల కాలంలో ఆలివ్ రిడ్లే తాబేళ్ళ మృత్యువాతపై ఏపి మత్స కారుల అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు అల్లిపల్లి ఎల్లాజీ, సభ్యులు శ్రీనివాస్, మధ ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు.ఫార్మా కంపెనీలు, ఇతర పరిశ్రమలు విడుదల చేస్తున్న రసాయన వ్యర్థాలు, ఇతర కాలుష్యంతో పాటు మానవ తప్పిదాలు కూడా వీటి మృతికి కారణమని అభిప్రాయం వ్యక్తం చేశారు. రసాయన వ్యర్థాలను శుద్ధి చేసి విడుదల చేయాలన్న నిబంధనలు అటకెక్కించడం, కాలుష్యనియంత్రణ చర్యలు చేపట్టకపోవడం వల్లే సముద్రజీవులు మృతి చెందుతున్నాయని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు గురువారం సత్యం జంక్షన్ వద్ద రూ. 59.75 లక్షల జివిఎంసి నిధులతో చేపట్టే గ్రీన్ బెల్ట్ గ్రిల్స్ నిర్వహణ పనులకు శంకుస్థాపన చేశారు. జెడ్‌సి శివప్రసాదరావు, శ్యామల దీపిక. ఇఇ గంగాధర్, డిఇఇ విజయ్ కుమార్, ఎఇఇ శ్రీనివాసరావు. వర్క్ ఇన్స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు మద్దతు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు అక్కయ్యపాలెం పోర్ట్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు తెలిపింది. అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ విడనాడి, ప్రత్యామ్నాయం చూడాలన్నారు. రాగిపిండి గ్లాసుల వాడకం ద్వారా అందులోని ద్రావణంతోపాటు గ్లాసును తినేయవచ్చని, తద్వారా ఆరోగ్యంతోపాటు పర్యావరణ పరిరక్షణకు సహకరించినట్లు అవుతుందన్నారు.

రైతు బజార్ వద్ద గుడ్డ సంచుల పంపిణీ

గుడ్డ సంచులను పంపిణీ చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి -గోపాలపట్నం : పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యతగా సిబిఐ మాజీ జెడీ లక్ష్మీనారాయణ పిలుపు మేరకు కోరమండల్ ఇంటర్నేషనల్ సౌజన్యంతో జెడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం గోపాలపట్నం రైతు బజారు వద్ద పలువురికి గుడ్డ సంచులను పంపిణీ చేశారు. రైతుబజారు, సచివాలయ సిబ్బంది వీటిని వినియోగదారులకు అందజేశారు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కల్పించి, వాటి నియంత్రణకు సహకరించాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి గోపి, రైతు బజార్ ఎస్టేట్ అధికారి జి ప్రసాద్. సచివాలయ సిబ్బంది మణికుమార్, చైతన్య కుమారి, శోభా రాణి, జెడి ట్రస్ట్ ప్రతినిధుల్లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కేంద్ర కారాగారంలోకి ఖైనీ ప్యాకెట్లు

ప్రజాశక్తి - ఆరిలోవ: విశాఖ కేంద్రకారాగారంలో ఇటీవల వరుస ఘటనల చోటుచేసుకుంటున్నాయి. కేంద్ర కారాగారం గురువారం మరోసారి వార్తల్లోకి ఎక్కింది. కేంద్రకారాగారంలోని స్టీల్ ఫ్యాక్టరీలో ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావు గురువారం తన లోదుస్తుల్లో ఖైనీ ప్యాకెట్లను తీసుకెళ్లాడు. సిబ్బంది చేసిన సాధారణ తనిఖీల్లో ఈ ఖైనీ ప్యాకెట్లు లభ్యమయ్యాయి. జైలు అధికారులు దీనిపై సమగ్ర విచారణ చేపట్టారు.

అదృశ్యమైన బాలల ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఎంవిపి పోలీసుస్టేషన్ పరిధిలో ఈ నెల 21వ తేదీన అదృశ్యమైన ఇద్దరు విద్యార్థుల ఆచూకీ లభ్యమైంది. ఎంవిపి పోలీసులు కథనం ప్రకారం... నక్కవానిపాలెం, క్రాంతినగర్‌కు చెందిన చట్ల ధీరజ్ (13), మద్దిలపాలెం చైతన్యనగర్‌కు చెందిన దత్తి యశ్వంత్ (14) అదే ప్రాంతంలో ఉంటున్న భావన్ విద్యానికేతన్‌లో 9వ తరగతి చదువుతున్నారు. వీరిలో ధీరజ్ ఈ నెల 21వ తేదీ సాయంత్రం తన స్నేహితుడు యశ్వంత్ పుట్టినరోజు ఉందని, వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అదే రోజు యశ్వంత్ కూడా ట్యూషన్‌కు వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయారు. రాత్రి కావస్తున్నా ఇరువురు ఇళ్లకు చేరకపోవడంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్లా వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 22వ తేదీన ఎంవిపి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిఐ మురళీ మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ ధనుంజయనాయుడుకు విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఎస్ఐ ధనుంజయ నాయుడు విచారణ చేపట్టారు. విచారణలో విద్యార్థులిద్దరూ మంగళవారం సాయంత్రం విశాఖ రైల్వేస్టేషన్‌కు చేరుకొని రైలుపై హైదరాబాద్ వెళ్లినట్లు నిర్ధారణకు వచ్చారు. హైదరాబాద్ పోలీసులకు ఎంవిపి పోలీసులు సమాచారం అందించారు. దీంతో హైదరాబాద్‌లో రైల్వే పోలీసులు విద్యార్థులను గుర్తించి పట్టుకున్నారు. ఎంవిపి పోలీసులు విద్యార్థులను తీసుకొచ్చేందుకు హైదరాబాద్ వెళ్లారు.

37 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో నాటు సారా, మద్యం సీసాలను సీజ్ చేసి, వ్యక్తిని అరెస్టు చేసినట్లు సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. గ్రామానికి చెందిన జి చిన్న అప్పారావు ఇంటిలో 37 మద్యం సీసాలు,3 లీటర్ల నాటు సారాతో పట్టుబడినట్లు తెలిపారు. మద్యం సిసాలను, నాటు సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి చిన్న అప్పారావును రిమాండ్ కు తరలించినట్లు వెల్లడించారు.

దౌర్జన్యంగా భూఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఏళ్ల తరబడి తమ అనుభవంలో ఉన్న భూమిలోకి దౌర్జన్యంగా ప్రవేశించి ఆక్రమించే ప్రయత్నం చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆనందపురం మండల కేంద్రానికి చెందిన సుంకరి అప్పల రాములమ్మ కోరారు. గురువారం స్థానిక ఆర్‌డిఒకార్యాలయంలో పరిపాలనా విభాగం అధికారి మనోరంజనికి ఫిర్యాదు చేశారు.తమ మెట్టు భూమిలోని మామిడి, టేకు చెట్లకు రక్షణగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను, సిమెంట్ రేకుల షెడ్డును జెసిబితో ధ్వంసం చేశారని, గడ్డి వామును మాయం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు, తన భూమికి రక్షణ కల్పించాలని బాధితురాలు కోరారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ :మధురవాడ సబ్‌స్టేషన్ పరిధిలోని మధురవాడ 11కెవి ఫీడర్, కొమ్మాది సేవానగర్‌లో శుక్రవారం విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ మూడవ జోన్ డిఇఇ పి.శ్రీనివాసరావు తెలిపారు. మధురవాడ, రేవళ్ల పాలెం, చంద్రం పాలెం, ఎన్‌జివోస్ కాలనీ, వుడా కాలనీ, భగవాన్ దాస్ కాలనీ, ఎంఎస్ఆర్ లేఅవుట్, సాయిప్రియా లేఅవుట్, భాస్కర్ నగర్, సంపత్ నగర్, ఉజ్వల హాస్పిటల్ ఏరియా. కొమ్మాది జంక్షన్, శ్రీనివాసనగర్, సాయిరాం కాలనీ, జిసిసి లేఔట్, టీచర్స్ లేఔట్, అమరావతి కాలనీ, సూర్యా పేపర్, డ్రైవర్స్ కాలనీ (సాయిరాం కాలనీ, వెంకట్ నగర్ ఎస్‌సి కాలనీ, మాస్టర్ స్కూల్ ఏరియా తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మెడికల్ ప్రీమియం పెంచొద్దు

విశ్రాంత ఉద్యోగులపై ఉక్కు యాజమాన్య వైఖరికి నిరసనగా ధర్నా

ధర్నా చేస్తున్న స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు నేతలు

ప్రజాశక్తి -ఉక్కునగరం : విశ్రాంత స్టీల్ ఉద్యోగులపై యాజమాన్య వైఖరి మార్చుకోవాలని స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్ డిమాండ్ చేశారు. గురువారం స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో ఉక్కు ప్రధాన పరిపాలన భవనం ఎదుట విశ్రాంతి స్టీల్ ఉద్యోగులపై వైద్యం భారాన్ని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌ఛార్జి సిఎండి సక్సేనాకు వినతి పత్రం అందజేశారు. యాజమాన్య వైఖరికి వ్యతిరేకంగా విశ్రాంత స్టీల్ ఉద్యోగులు, స్టీల్ కార్మికులు పెద్ద ఎత్తున నినదించారు.

ఈ సందర్భంగా వైటి దాస్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలకు పైగా విధులు నిర్వర్తించి, ప్లాంట్ అభివృద్ధిలో భాగమైన ఉద్యోగులపై యాజమాన్యం నిరంకుశ వైఖరి దుర్మార్గమన్నారు. గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్ స్కీమ్‌లో మెడికల్ ప్రీమియం ఉద్యోగుల వాటా పెంపు నిర్ణయాన్ని తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల బకాయి వేతనాలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. స్టీల్ కార్మికుల పిఎఫ్, ఎస్ఎబిఎఫ్, త్రిఫ్ట్ తదితర సంస్థలకు యాజమాన్యం చెల్లించాల్సిన బకాయిలను వడ్డీతో సైతం చెల్లించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం ఏకపక్షంగా తీసుకునే నిర్ణయాలను తక్షణం విరమించుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, జిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు ఎన్ రామారావు, మాజీ సిఐటియు అధ్యక్షులు ఎం.కృష్ణారావు మాట్లాడుతూ ఉద్యోగవిరమణ తర్వాత కేవలం రూ.రెండు వేలు పెన్షన్ అందుతున్న వారిపై రూ. ఏడు వేల భారం వేస్తున్న యాజమాన్యం బాధ్యతారాహిత్యాన్ని దుయ్యబట్టారు. కార్మిక సంఘాలతో చర్చించి స్కీములో మార్పులు చేయాలన్నారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు రామన్న, స్టీల్ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

పద్మపూజిత వీల్స్ మార్ట్ లక్కీడ్రా

లక్కీడ్రాలో పాల్గొన్న సంస్థ అధినేత బసవరాజు, ఉద్యోగులు

ప్రజాశక్తి-సీతమ్మధార : పద్మ పూజిత వీల్స్ మార్ట్ సంస్థ అభివృద్ధికి వినియోగదారులతోపాటు సంస్థ ఉద్యోగులే ముఖ్య కారణమని సంస్థ అధినేత బసవరాజు అన్నారు. గురువారం దొండపర్తిలోని సంస్థ కార్యాలయంలో దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి ఆఫర్లతో లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవరాజు మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలు బ్రాంచ్‌ల అభివృద్ధిలో కస్టమర్లు కీలకమన్నారు. సంస్థకు వచ్చిన లాభాల్లో కొంతమొత్తాన్ని వినియోగదారులకు బెనిఫిట్‌గా అందజేయాలనే ఉద్దేశ్యంతో ఏటా ఆఫర్లు పెడుతున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని బ్రాంచ్‌ల ఏర్పాటుతోపాటు, బైక్ కొనుగోలుదారులకు మూడు నుంచిఆరు నెలల వారెంటీ ఇస్తామన్నారు. 22 ఏళ్లగా వీల్స్‌మార్ట్ అభివృద్ధికి సహకరిస్తున్న విశాఖ వినియోగదారులకు ధన్యవాదాలు తెలిపారు. సంస్థ ఉద్యోగుల ఆటవిడుపునకు ఏటా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. లక్కీడ్రాలో విజేతలకు రెండు ల్యాప్‌టాప్‌లు, నాలుగు ట్యాబ్‌లను అందజేశారు సంస్థ ప్రతినిధులు సాయిబాబు. శ్రీనివాసరావు. వేణు .వినోద్. కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

మెటీరియల్ అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- గాజువాక: గాజువాక జోన్ పరిధిలోని అక్కిరెడ్డిపాలెం, మింది, గాజువాక, కణితి, అగనంపూడి, యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు గురువారం యుటిఎఫ్ ముద్రించిన 10వ తరగతి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. యుటిఎఫ్ గాజువాక మండలశాఖ ప్రధాన కార్యదర్శి సబ్బారపు నూకరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పంపిణీలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు మాట్లాడుతూ, టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగ పడుతుందని,ఉచితంగా అందించిన యుటిఎఫ్ మండల శాఖకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమములో యూనియన్ మండల అధ్యక్షుడు ఎస్వి. శ్రీనివాస్, సహాధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ హక్, సుగుణ, శ్రీనివాస్ రాజు, సువర్ణలత, ప్రసూనాంబ పాల్గొన్నారు..

పింఛనుదారులకు దృష్టి లోప నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : దృష్టిలోప వైకల్యంతో జివిఎంసిఒకటో జోన్ పరిధిలో పింఛను పొందుతున్న 147లబ్ధిదారుల్లో గురువారం తొలి విడతలో వంద మందికి విశాఖ నగరంలోని ప్రభుత్వ నేత్ర వైద్యశాలల్లో నిర్ధారణ పరీక్షలు చేశారు. దృష్టిలోప సమస్యతో ఒకటో వార్డులో 26 మంది, రెండో వార్డు లో 29 మంది, మూడో వార్డు లో 25 మంది 4వ వార్డు లో 67 మంది ఉన్నారు. వీరి అర్హతలను నిర్ధారించి, పింఛను కొనసాగింపునకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

లబ్ధిదారుల్లో గుబులు

అనర్హత పేరిట వికలాంగుల పింఛనుదారుల సంఖ్యను తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఇప్పటికే ప్రజాసంఘాలు, ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో పింఛను పొందుతున్న తమకు ఇపుడు వైకల్యం నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తుండడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది.

జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో 989 వికలాంగ పింఛన్లు ఉండగా, వైకల్యం కేటగిరీల వారీగా నెలకు రూ 3 వేలు నుంచి రూ 6 వేలు, పూర్తి వైకల్యం ఉన్న వారికి రూ 5 వేలు నుంచి రూ 15 వేలు, కిడ్నీ, తలసేమియా బాధితులకు రూ 5 వేలు నుంచి రూ 10 వేలు పింఛను పొందుతున్నారు.ఒకటో వార్డులో 254 మంది, రెండో వార్డులో 268 మంది, మూడో వార్డు లో 192 మంది, నాల్గో వార్డులో 275 మంది వికలాంగ పింఛన్లర్లు ఉన్నారు.ఉన్నారు.

కెకెఆర్ గౌతమ్ పాఠశాల దశమ వార్షికోత్సవం

వార్షికోత్సవంలో పాల్గొన్న యాజమాన్య ప్రతినిధులు

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు చినముషిడివాడ కెకెఆర్ గౌతమ్ పాఠశాల దశమ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభించిన విద్యాసంస్థల విశాఖ జోన్ డీన్‌లు శేషు బాబు, శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ అలవరచుకున్న విద్యార్థులు చదువులోనూ ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని, అటువంటి వారికి కెకెఆర్ గౌతమ్ విద్యాసంస్థలు వేదికలన్నారు. తమ పాఠశాల సాధించిన విజయాలను వివరించారు కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఆర్ భాగ్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ భవాని, యాక్టు ప్రిన్సిపల్ ప్రణీత్, బిజెపి నాయకులు గొర్లి రామునాయుడు, జ్యోతి పాల్గొన్నారు

మాజీ మంత్రి అప్పల నర్సింహరాజు జన్మదిన వేడుక

మాజీమంత్రికి శుభాకాంక్షలు చెబుతున్న కూటమి నేతలు

ప్రజాశక్తి పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీలోని తన నివాసంలో మాజీమంత్రి ఆర్ఎస్‌డిపి అప్పల నరసింహరాజు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు కూటమి నేతలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్చాలను అందజేసి, శాలువాలతో సత్కరించారు. ఎమ్మెల్యేగా, మాజీమంత్రిగా అప్పలనర్సింహరాజు చేసిన సేవలను, నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషిని, ఆయనతో తమకున్న అనుబంధం, సాన్నిహిత్యాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో పాండ్రంగి టిడిపి నేతలు కుచ్చెర్ల పాటి రామరాజు,మహంతి అప్పలరమణ, (శ్రీనివాసరావు) బర్నాల శ్రీనివాసరావు, అలుగోలు బ్రహ్మం బిజెపినేతలు పివివి.ప్రసాదరావు పట్నాయక్, బిజెపి నేతలు డి.సుధాకర్ వర్మ, బంక సీతంనాయుడు కొలుసు శ్రీను పాల్గొన్నారు.

భీమునిపట్నం : మాజీ మంత్రి ఆర్ఎస్‌డిపి అప్పల నరసింహరాజు పుట్టిన రోజు సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గురువారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.పద్మనాభం మండలం, పాండ్రంగిలో ఉన్న అతని ఇంటికి వెళ్ళి పుష్ప గుచ్చాలు అందజేసి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూక రాజు, న్యాయ వాది కె ఎస్ ఎం సుధాకర్, ఆదర్శ హిందీ ప్రే మీ మండలి అధ్యక్షులు కె ఎస్ ఆర్ కృష్ణారావున్నారు.

కబడ్డీ విజేతలకు బహుమతులు అందజేత

బహుమతులను అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి - గోపాలపట్నం : లోకేష్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ విప్ గణబాబు, తెలుగు యువత నేత మౌర్య సింహ ఆధ్వర్యంలో గోపాలపట్నం సుకన్య హాల్ ప్రాంగణం వద్ద గురువారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాల నుంచి పురుషులు, మహిళల జట్లు పాల్గొనగా, ఆద్యంతం పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. విజేలకు విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు బహుమతులను అందజేశారు అత్యధికంగా టిడిపి సభ్యత్వాలు చేసిన బూత్ ఇంచార్జ్ , వార్డ్ నాయకులను సత్కరించి , జ్ఞాపికలు అందజేశారు. టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు గండి బాబ్జీ, వార్డ్ కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, బొమ్మిడిరమణ , శరగడం రాజశేఖర్, గల్లా చిన్న, పాల్గొన్నారు.

గీతం విద్యార్థుల ఫ్లాష్ మాబ్

ఫ్లాష్‌మాబ్‌లో నృత్యాలు చేస్తున్న గీతం విద్యార్థులు

ప్రజాశక్తి -మధురవాడ : ఈనెల 29, 30, 31 తేదీలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ నిర్వహిస్తున్న గీతం ఎక్సెలెన్స్ మీట్ (జెమ్) 2025 యువజనోత్సవానికి సన్నాహకంగా గురువారం వర్సిటీ ఆవరణలో ఫ్లాష్ మాబ్‌ను నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ విద్యార్థులు ఫ్లాష్ మాబ్‌లో నృత్యాలు చేశారు. భావి యువతను నాయకత్వ లక్షణాలతో బలోపేతం చేయడం ప్రధాన ఉద్దేశ్యంగా 'సామర్థ్య' పేరిట జెమ్-25 యువజనోత్సవాన్ని మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక చీఫ్ ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్.ఎస్.మిత్ర తెలిపారు. వివిధ కళాశాలల విద్యార్థులకు క్రికెట్, బ్యాడ్మింటన్, త్రోబాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, చెస్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

కొండవాలు ప్రాంత సమస్యలపై ఆరా

జెడ్‌సి ఫణిరాంతో వార్డులో పర్యటిస్తున్న కార్పొరేటర్

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి రెండవ జోన్, ఐదో వార్డు పరిధిలోని సర్వేనెంబరు 27 శివశక్తినగర్ రోడ్డులోని అయ్యప్పనగర్, వివేకానంద నగర్, ముత్యాలమ్మకాలనీ, గాంధీనగర్, శివశక్తినగర్ శ్మశానవాటిక, బొట్టవానిపాలెం చెరువు తదితర కొండవాలు ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మొల్లి లక్ష్మణరావులతో కలిసి జెడ్‌సి ఫణిరామ్ గురువారం పర్యటించారు.ఈ సందర్భంగా కొండవాలు ప్రాంత సమస్యలపై జెడ్‌సి ఆరా తీశారు.

ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత పలు సమస్యలను జెడ్‌సి దృష్టికి తెచ్చారు. ఇంటి పన్ను బిల్లులు లేక వ్యక్తిగత తాగునీటి కుళాయిలు వేయడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వెంటనే అందరికీ ఇంటి పన్ను బిల్లులు ఇవ్వాలని కోరారు. శ్మశానవాటిక అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, బొట్టవానిపాలెం చెరువు ఆధునికీకరణ, కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గాలను నిర్మించాలని, కార్పెంటర్ కాలనీలో తాగునీటి పైపులైన్లు తొందరగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో

డిజిటల్ తరగతుల బోధనకు ప్రత్యేక నైపుణ్యత అవసరం

ప్రజాశక్తి -మధురవాడ: డిజిటల్ యుగంలో విద్యార్థులు అదనపు సమాచారం కోసం ఇంటర్నెట్ ద్వారా అనుసంధానం అవుతున్నారని, వారిని తరగతి గదిలో ఏకాగ్రతగా ఉంచాలంటే అధ్యాపకులు ప్రత్యేక నైపుణ్యాలను అలవరచుకోవాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు అన్నారు. గురువారం గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అధ్యాపక శిక్షణలో ఆన్‌లైన్‌లో మాట్లాడారు.

తరగతి గదిలో అధ్యాపకులతో ముఖాముఖి చర్చలు, ఆలోచనలు రేకెత్తించే ప్రశ్నలు, సిలబస్‌లో లేని అదనపు సమాచారాన్ని అందించడం ద్వారా విద్యార్థులు కోర్సు పట్ల ఆసక్తి పెంచవచ్చునని సూచించారు. ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ విభాగం డైరక్టర్ ప్రొఫెసర్ జివిఆర్.శర్మ మాట్లాడుతూ కాలానుగుణంగా అధ్యాపకులు బోధనా విధానాలు మార్చుకోవాలని, పరిశోధన ద్వారా లోతైన సమాచారాన్ని గ్రహించి విద్యార్థులకు అందించాలన్నారు. స్టూడెంట్ ఎంగేజ్‌మెంట్ స్ట్రాటజీస్ పేరిట జరిగినకార్యక్రమంలో కార్పొరేట్ నిపుణులు సురజ్ అరవింద్, అదిత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల భాగంగా గురువారం స్థానిక రింగ్ రోడ్డు కూడలి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు చేపట్టిన అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ "శ్రద్ధ వహించండి" అనే నినాదంతో జాతీయ రహదారుల భద్రత మాసోత్సవాలను జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రహదారి ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. హెల్మెట్ ధారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మానవ తప్పిదాల వల్లే 75 శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. పరిమితికి మించి వేగం, మద్యంసేవించి వాహనం నడపడం, సెల్ ఫోన్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే కార్యక్రమాలను ముమ్మరం చేయాలని సూచించారు. అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వారి ప్రాణాలకు ప్రమాదమనే అంశంపై అవగాహన పెంచాలన్నారు. ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమావళి, జాతీయ రహదారులపై వాహనాలు నడిపే క్రమంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి జి.మనోహర్, రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు, పెద్ద ఎత్తున విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల తదితరులు

వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న కొటాన రాము, అప్పారావు

ఉత్సాహంగా జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు ఆదిరెడ్డిపాలెం గ్రామంలో శ్రీసీతారాములవారి తీర్థ మహోత్సవం సందర్భంగా గురువారం జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆర్ఇసిఎస్ మాజీ చైర్మన్ కోటాన అప్పారావు, మాజీ జెడ్పిటిసి కోటాన రాము, ఎంపీటీసీ బైలపూడి దేముడు ప్రారంభించారు. ఈ పోటీల్లో 20 టీములు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ప్రధమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.8 వేలు, తృతీయ బహుమతి రూ.6 వేలు, నాలుగో బహుమతి రూ.4 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గొర్లి లక్ష్మీ కనకం, కోటాన రమణ, గొర్లి ప్రసాద్, కోటాన ఆనంద్, ఆదిరెడ్డిపాలెం యూత్ పాల్గొన్నారు.

బంగారు, కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారులు

జాతీయ త్వైకాండో పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-చోడవరం : జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి జిల్లాకు బంగారు పతకం దక్కినట్లు ఉమ్మడి జిల్లా తైక్వాండో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు అల్లం మురళీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నెల 18 నుండి 20వ తేదీ వరకు ఉత్తర ప్రదేశ్ వరకు రాజాజీపురం మినీ ఇండోర్ స్టేడియంలో జరిగిన 7వ ఓపెన్ జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో చోడవరం సహస్ర స్పోర్ట్స్ అకాడమీ ఆరిలోవ విద్యార్థులు కొల్లిపార తన్విత్ ఉదయ్ సబ్ జూనియర్ ఇండివిజల్ పూమ్‌సేలో బంగారం పతకం, క్యోరుగి అండర్ 32 డివిజన్‌లో కాంస్య పతకం, కెడేట్ ఇండివిజల్ పూమ్ సేలో బంగారు పతకాలు సాధించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను, టీమ్ కోచ్‌లు కె ప్రదీప్ కుమార్, గండి శేఖర్ బాబులను ఎపి తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు టి.హర్షవర్ధన్ ప్రసాద్, సెక్రటరీ చంద్ర మౌళి, ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను, జాయింట్ సెక్రటరీ డివి చారి, ట్రెజరర్ లక్ష్మి నారాయణ, జిల్లా సెక్రటరీ పి గణేష్ కుమార్, ట్రెజరర్ చంద్ర శేఖర్ అభినందించారు.

కమ్మేస్తున్న పొగ మంచు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో పొగ మంచు కప్పేసింది. గురువారం తెల్లవారుజామున 4 గంటల నుండి మంచు దట్టంగా కురిసింది. ఏజెన్సీ ప్రాంతం వలే మైదాన ప్రాంతంలో కూడా మంచు దుప్పటి అలుముకోవడంతో ప్రకృతి ప్రేమికులు మంచు అందాలను ఆస్వాదించారు. దట్టంగా కురిసిన పొగమంచుకు వాహనందారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కశింకోట -బంగారు మెట్ట రోడ్డులో ఎదురు వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో లైట్లు వేసుకొని ప్రయాణాలు సాగించారు.

కశింకోట : కశింకోట మండలంలో గురువారం తెల్లవారజామున 4 నుండి ఉదయం 9 గంటల వరకు తాళ్ళపాలెం-నర్సీపట్నం రోడ్డులో వర్షం మాదిరిగా మంచు కురిసింది, అనకాపల్లి- నర్సీపట్నం వైపు వెళ్లి, వచ్చే వాహనాలు లైట్లు వేసుకొని ప్రయాణించారు. చాలా చోట్ల చలి మంటలు వేసుకొని ఉపశపనం పొందారు. ఇలాంటి మంచు కురవడం జీడీ, మామిడి తోటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు అంటున్నారు.

తాళ్లపాలెం-నర్సీపట్నంలో రోడ్డులో లైట్లు వేసుకొని వెళ్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల విజేత విశాఖ లైన్స్

కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని నాగయ్యపేట శివారు సీతంపేటలో మరిడిమాంబ తీర్థం సందర్భంగా రెండు రోజులు పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో విశాఖ లైన్స్ జట్టుకు ప్రథమ స్థానం దక్కింది. ఈ పోటీల్లో 22 జట్లు పాల్గొన్నాయి. ఫ్లడ్ లైట్లు కాంతుల్లో పోటా పోటీగా జరిగిన ఈ కబాడీ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా కోరట్ల జట్టు రెండో స్థానంలోనూ కాకినాడ జట్టు , మూడు స్థానంలోనూ, దేవరాపల్లి మండలం బొడ్డపాడు జట్టు నాలుగవ స్థానంలోనూ నిలిచాయి. విజేతలకు ప్రథమ బహుమతి రూ.20 వేలు, 2వ బహుమతి రూ.15 వేలు, మూడవ బహుమతి రూ.6 వేలు, 4వ బహుమతి రూ.4 వేలు ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బోను అప్పలనాయుడు, గాలి రాజు, సూర్య ప్రకాష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని కొరువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎస్‌సిఇఆర్‌టి, డిసిఇబి స్టడీ మెటీరియల్‌ను అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం కమల కుమారి, ఉపాధ్యాయులు, ట్రస్ట్ సభ్యుల చేతులు మీదుగా 27 మంది విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం కమల కుమారి మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివి 100 శాతం మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు, సభ్యులు జూరెడ్డి దివాకర్, కిరణ్, యడ్ల స్వాతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెటీరియల్ అందిస్తున్న హెచ్ఎం కమలకుమారి, గొంప వెంకటరావు

ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక గవరపాలెం శ్రీగౌరీ పరమేశ్వరుల మహోత్సవ సందర్భంగా కీర్తిశేషులు కొణతాల లక్ష్మీనారాయణ సూర్యకళ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు డాక్టర్ కొణతాల నగేష, కొణతాల జగదీష్ ఆధ్వర్యంలో గురువారం గవరపాలెం పార్క్ సెంటర్ మళ్ల జగన్నాథ్ కళ్యాణ మండపంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇందులో అత్యధిక పరికరాలతో క్యాన్సర్ పరీక్షలతో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు బ్రహ్మానాయుడు, వైద్య సిబ్బంది, ఉత్సవకమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల మహలక్ష్మినాయుడు, నూకాంబికా దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, కొణతాల శ్రీనివాసరావు, దొడ్డి భోగేష్. బుద్ధ లక్ష్మణ్, పిళ్లా సత్యనారాయణ, గండేపల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.

చెరకు యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా చెరకు సాగును లాభసాటిగా మార్చుకోవచ్చని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ సిహెచ్ ముకుందరావు అన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఒరిస్సా రైతులకు వారం రోజులపాటు అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఏఆర్ఎస్‌లో అభివృద్ధి పరచిన ఉత్తమ చెరకు రకాలు, ఉత్తమ సాంకేతిక పరిజ్ఞానం, సస్యరక్షణ, సస్య పోషణ, జీవన ఎరువులు, జీవ నియంత్రణ పద్ధతులు, భూసార పరీక్ష ప్రాముఖ్యత, బెల్లం విలువ ఆధారిత ఉత్పత్తులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఎఆర్ఎస్ శాస్త్రవేత్తలు ఆదిలక్ష్మి, పీవీకే జగన్నాథరావు కె.వి.రమణమూర్తి, విశాలాక్షి, ఉమామహేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు కిరణ్ ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉత్తరాఖండ్‌లో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 14 వరకు జరగనున్న 38వ జాతీయ క్రీడలు ఖోఖో పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి అనకాపల్లి మండలం తుమ్మపాల క్రీడా మండలికి చెందిన బర్నికాన కిరణ్ ఎంపికయ్యాడు. కిరణ్ ఎంపిక పట్ల విశాఖ జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షులు దాడి జైవీర్, కార్యదర్శి సిహెచ్ఎల్ఎం శ్రీనివాసరావు, క్రీడా మండలి అధ్యక్షులు పీలా వీరు నాయుడు, కర్రి అప్పారావు, కెయం నాయుడు, దాడి శ్యాం ప్రసాద్, కర్రి మాధవరావు, కర్రి సూర్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయిలో విజయం సాధించి గ్రామానికి మంచి పేరు రావాలని ఆకాంక్షించారు.

కిరణ్

గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక గవరపాలెంలో శనివారం జరిగే శ్రీగౌరీపరమేశ్వరుల మహోత్సవం సందర్భంగా వివిధ ప్రదేశాలను స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి బి అప్పారావు, డిఎస్‌పి ఎం శ్రావణి, సిఐలు టీవీ విజయ్ కుమార్, వెంకటనారాయణ గురువారం పరిశీలించారు. గౌరీ పరమేశ్వరుల ఉత్సవానికి పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవకమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల మహాలక్ష్మి నాయుడు, ఆలయ ప్రతినిధులు కొణతాల మురళీకృష్ణ, పివి.రమణ, కొణతాల ప్రసాద్, దాడి కృష్ణ, పెంటకోట జగది, సూరిశెట్టి నర్శింగరావు, బుద్ధ భూలోకనాయుడు, కొణతాల కృష్ణంరాజు, కాండ్రేగుల శ్రీను, కెఎం. నాయుడు ఇతర నాయకులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్చుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 12 మంది మెరిట్ విద్యార్థులకు గురువారం బోగాపురం గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి చందు ఆర్థిక సహాయంతో ఎగ్జామ్ ప్లాంక్, లాంగ్ స్కేల్, పెన్ను అందించారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ తాను ఈ హైస్కూల్లో చదువుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రితో విద్యార్థులు

మాట్లాడుతున్న టిడిపి మండల అధ్యక్షులు సూర్యనారాయణ

నేడు పోతల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-దేవరాపల్లి : రైవాడ జలాశయం ప్రాజెక్టు చైర్మన్‌గా పోతల పాత్రునాయుడు ప్రమాణ స్వీకారం కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు కొమర బాబురావు తెలిపారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్థానిక రైవాడ అతిథి గృహం ఆవరణలో జరిగే ఈ కార్యక్రమానికి మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కెఎస్ఎన్ఎస్.రాజు, రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, వెలమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పివిజి.కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టిడిపి సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నేతలు వేచలపు గోవింద, కాసుల కృష్ణ, బండారు శ్రీరామ్మూర్తి, ముక్కు ఈశ్వరరావు, ముసలి పైడిరాజు, టి.ప్రసాద్, ముత్యాలరావు పాల్గొన్నారు.

దేవీపురం ఆలయానికి విద్యుత్ దీపాలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బాట జంగాలపాలెం గ్రామానికి ఆనుకొని వున్న దేవీపురం ఆలయానికి విద్యుత్ దీపాలను గురువారం పునరుద్ధరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పడాల వెంకట రమణ మాట్లాడుతూ ఆనందపురం -అనకాపల్లి జాతీయ రహదారి16 ఆలయం వరకు గతంలో ఏర్పాటు చేసిన వీధి దీపాలను తిరిగి పునరుద్దరణ చేసి కొత్త వీధి దీపాలు వేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఈసిఎస్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుమార్, లైన్‌మెన్ సతీష్ స్వామి, దేవిపురం ట్రస్ట్ సుపర్వైజర్ అనకాపల్లి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీ చిన్నిబాబు కాలనీలో కొణతాల అప్పలరాజు ఇంటి నుంచి ఫారం గోర్జు వరకు ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.30 లక్షలతో జరుగుతున్న సిమెంటు రోడ్డు పనులను అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ గురువారం పరిశీలించారు. డిఈ వేణుగోపాల్, ఏఈ బాలజీ అప్పారావు, కాంట్రాక్టర్లను నాణ్యత విషయంలో రాజీ పడొద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ కర్రి బాబి, రాపేటి రామ్ కుమార్, సాగునీటి సంఘం అధ్యక్షులు పీలా సీతారామ్, నాయకులు పీలా తాతు నాయుడు, ఆడారి గోవిందరావు, పీలా విశ్వేశ్వరరావు, కొణతాల రమణ బాబు, గాలి జగదీష్, కరణం శ్రీను, అప్పారావు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ప్రతిష్ట శత వార్షికోత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిష్ట శత వార్షికోత్సవలు గురువారం ఘనంగా నిర్వహించారు. మైసూర్ ఆవధూత, దత్త పీఠాధిపతి జగద్గురు ఉత్తరాధికారి శ్రీదత్త విజయానంద తీర్థ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ముగింపు ఉత్సవాల ఆహ్వాన పత్రికలు ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరుకొండ బుచ్చిరాజు, డాక్టర్ గ్రంధి శేషు కుమార్, పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట శివారు నేతవానిపాలెంలో గురువారం పారిశుధ్యపనులు ప్రారంభించారు. గ్రామంలోని మెయిన్ రోడ్డు పక్కన గల డ్రైనేజీలో పారిశుధ్య సిబ్బంది పూడిక తీత చేశారు. డ్రైనేజీల్లో మట్టి చెత్త నిండి పోవడంతో మురుగు నీరు నిలిచిపోతుంది. పనులు చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకర లక్ష్మి, ఈవో లవరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేతవానిపాలెంలో పూడిక తీస్తున్న పారిశుధ్య సిబ్బంది

పలు చోట్ల పశు వైద్య శిబిరాలు

పశువైద్య శిబిరంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వం నిర్వహించే ఉచిత పశు వైద్య శిబిరాలను పాడి రైతులు రైతులు సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సౌజన్య అన్నారు. అనకాపల్లి మండలం మామిడిపాలెం రైతు సేవ కేంద్రం వద్ద గురువారం ఉచిత పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, ఆరోగ్య పరీక్షలు చేశారు. మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి సిహెచ్ అనిల్ కుమార్, రైతు సేవ కేంద్రం సిబ్బంది కుమారి, అప్పారావు, కిరణ్, వెంకట్, రమణ, హరి, కావ్య స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కశింకోట : మండల కేంద్రం కశింకోటలో పశు వైద్యాధికారి డాక్టర్ అల్ఫోన్సా జార్జ్ ఆధ్వర్యాన జరిగిన పశు వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ జయ రజిని ప్రారంభించారు. కార్యక్రమంలో వేగి గోపికృష్ణ, సిద్దిరెడ్డి శ్రీను, పెంటకోట రాము, నడిపల్లి సన్యాసిరావు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని వెన్నెలపాలెం, మూల స్వయంవరం గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాల్లో పశు సంవర్ధక శాఖ పరవాడ సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రామకష్ణ కీర్తి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వాడ చీపురుపల్లి, లంకెలపాలెం పశు వైద్యులు సురేష్ కుమార్, అశ్విని ప్రఫుల్లా, పశు సంవర్ధక శాఖ సహాయకులు బాలాజీ, భాస్కర్, పద్మ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట శనివాడ వారికల్లాల వద్ద గురువారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ సుంకర లక్ష్మీ ప్రారంభించారు. పశువైద్యాధికారిణి ఉమామహేశ్వరి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపాలమిత్రాలు మణికంఠ రైతులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని బోదువలస నిర్వహించిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ నేబర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు బి.సంధ్య, ఎస్.స్వర్ణలత, విఎ లక్ష్మణరావు, పశు సంవర్ధక శాఖ సహాయకులు, గోపాలమిత్ర పాల్గొన్నారు.

కోటవురట్ల : గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన ఆదాయ వనరు పాడి పరిశ్రమయే అని పందూరు సర్పంచ్ జగదీష్ అన్నారు, గురువారం పొందూరు గ్రామంలో పశు వైద్య సిబ్బంది ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా ఇరవై పశువులకు గర్భ కోశ చికిత్సలు నిర్వహించారు. నట్టల నివారణ మందులు అందజేశారు, కార్యక్రమంలో పశువైద్యులు ప్రతాప్, పాల్గొన్నారు.

రోలుగుంట : రోలుగుంట మండలం ఎంకే.పట్నం గ్రామంలో గురువారం బుచ్చంపేట పశువైద్యురాలు బాలమౌనిక ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 80 పాడిపశువులకు గర్భకోస వ్యాధులకు వైద్యం చేశారు. 1100 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది భవాని, రమణ, యశోద, దివ్య, సాయికృష్ణ, శివ, నానాజీ, శ్రీను పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని నేరెళ్లవలస సచివాలయం పరిధిలో గొర్రెలు పెంపకందార్ల సహకార సంఘం అధ్యక్షులు అప్పలరామయ్య అధ్యక్షతన ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు గర్భకోశవ్యాధులకు చికిత్సలు, లేగదూడలు, జీవాలకు డీవార్మింగ్, పాడిపశువులకు లవణ మిశ్రమం పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలపై పాడిరైతులు, జీవాల పెంపకందారులకు అవగాహన కల్పించారు.రెడ్డిపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ లక్ష్మణరావు, సుజాత, సచివాలయ సిబ్బంది తేజ, వేణుగోపాల్, గోపాల మిత్ర గంగరాజు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలో ఆనందపురం, బంటుపల్లి గ్రామపంచాయతీ, ముచ్చర్ల గ్రామాల్లో గురువారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 56 పశువులకు తనిఖీ చేసి 35 లేగ దూడలకు నట్ట నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో ఎడిషనల్ డైరెక్టర్ ప్లానింగ్ డాక్టర్ చిన్నయ్య, ఉచిత పశు వైద్య శిబిరాల స్పెషలాఫీసర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, మండల పశువైద్యాధికారి డాక్టర్ పి అనిల్ కుమార్ పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని పెదనందిపల్లి గ్రామంలో గురువారం జరిగిన శ్రీవిజయ వెంకట సత్యనారాయణమూర్తి స్వామి తీర్థ మహోత్సవానికి జనం పోటెత్తారు. ఉదయం నుంచి స్వామివారికి ధూప, దీప నైవేద్యాలతో ఆలయ అర్చకులు జగన్నాథ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నేతలు పోతల పాత్రునాయుడు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, కిలపర్తి భాస్కరరావు, గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని టెక్కలిపాలెం, ఆదిరెడ్డిపాలెం, జీవీఎంసీ పరిధి 88వ వార్డు వెదుళ్ళనరవ తదితర గ్రామాలలో తీర్థ మహోత్సవాలు ఘనంగా గురువారం నిర్వహించారు. వెదుళ్లనరవలో శ్రీముత్యమాంబ తీర్థ మహోత్సవం కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో జరిగింది. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆదిరెడ్డిపాలెంలో గ్రామ పెద్దలు, టెక్కలిపాలెంలో సర్పంచ్ గోంప సత్యవమ్మ నాయనప్ప ఆధ్వర్యాన జరిగాయి.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ

అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

శతకము పట్టు రామకోవుల వద్ద సీతారాముల తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు, ఎడ్ల పరుగు ప్రదర్శన ఏర్పాటు చేశారు. రాత్రి బుర్రకథ, డాన్స్ బేబీ డాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాజి శ్రీనివాసరావు, సుందరపు గంగాధర్, కుంచ అంజిబాబు, దాట్ల శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని కొత్త మల్లంపేట గ్రామంలో గురువారం సాయంత్రం తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్దలు తాడిపెద్దులతో ఊరేగింపుగా తరలివచ్చారు. హరినామ సంకీర్తనలతో హరి భజన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తీర్థం సందర్భంగా వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఉత్పత్తి నైపుణ్యాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తాము నెలకొల్పబోయే పరిశ్రమల ఉత్పత్తి నైపుణ్యాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్ గోవిందరావు తెలిపారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో కేంద్ర ప్రభుత్వ సంకల్ప పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, గ్రామీణభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఓపెన్ నెట్వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. రెండవ రోజు కార్యక్రమంలో సుమారు 100 మంది ఔత్సహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి ఎన్ గోవిందరావు గ్రామీణ ప్రాంతాలలో తయారు చేసే ఉత్పత్తులను ఓఎన్‌డిసిలో ఏ విధంగా మార్కెటింగ్ చేసుకోవాలి, బ్రాండింగ్, రిజిస్ట్రేషన్, ప్యాకింగ్ వంటి విషయాలపై అవగాహన కల్పించారు.

ఎస్‌పిని కలిసిన నర్సీపట్నం ఎఎస్‌పి

ప్రజాశక్తి-అనకాపల్లి : నర్సీపట్నం సబ్ డివిజన్ ఎఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన పోతిరెడ్డి శ్రీనివాస్ జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాను ఎస్పీ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్థానిక సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 3 గంటల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కె.కోటపాడు, చౌడువాడ, గొండు పాలెం, గుల్లేపల్లి, ఏ కోడూరు, మేడిచర్ల, ఆర్ఎన్.పాలెం, దాలివలస, గొట్లాం, కె.సంతపాలెం, ఆర్లే, భీమవరం, పైడంపేట తదితర గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కశింకోట : మండలంలోని బయ్యవరం సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్ఫర్ మెయింటెనెన్స్ కారణంగా శుక్రవారం మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని కశింకోట ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బయ్యవరం సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బాల కార్మికులతో పని చేయిస్తే చర్యలు

ప్రజాశక్తి-చోడవరం : బాల కార్మికుల చేత పని చేయించినా, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకపోయిన వారిపై చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ కమిషనర్ కే వసంతరావు అన్నారు. గురువారం చోడవరం కార్మిక శాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. సబ్బవరంలో వినాయకుని విగ్రహాలు తయారు చేస్తున్న యజమాని బాల కార్మికులతో పనిచేస్తుండడం తమ దృష్టికి రావడంతో అతనిపై కేసు నమోదు చేసి నష్టపరిహారం చెక్కును 26,750 అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక శాఖ అధికారి పి సూర్యనారాయణ పాల్గొన్నారు.

బాల కార్మికునికి నష్ట పరిహారం అందిస్తున్న కార్మికశాఖ అధికారులు

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలను స్పీకర్ అయ్యన్న నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ బాబు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో కేక్ కట్ చేస్తున్న విజయ్

మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక ఐదు రోడ్ల జంక్షన్‌లో బాల వినాయక దేవాలయంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆధ్వర్యంలోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీటీడీ పాలక వర్గ సభ్యుడు నర్సిరెడ్డి పాల్గొన్నారు. వార్డ్ కౌన్సిలర్ ధనమిరెడ్డి మధు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నక్కపల్లి: నక్కపల్లిలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను గురువారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. తెలుగు యువత, ఐ టిడిపి, టిఎన్ ఎస్ఎఫ్ నాయకులు కలిసి నక్కపల్లి 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టె, పండ్లు పంపిణీ చేశారు. మంత్రి అనిత ఇంటివద్ద నాయకులంతా కలిసి కేక్ కట్ చేశారు.టీడీపీ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కురందాసు నూకరాజు, టీడీపీ నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, ఎస్ రాయవరం మండల పార్టీ అధ్యక్షులు అమలంకంటి అబద్ధం, ఐటీడీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసు, తెలుగు యువత నాయకులు పద్దు, రామకృష్ణ, టీఎన్ఎస్ఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పెద్దిరెడ్డి వెంకటరమణ, టిడిపి నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, వైనబోయిన రమణ, పాయకరావుపేట నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రమాకుమారి పాల్గొన్నారు.

గొలుగొండ:రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు గొలుగొండ మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిటికెల సాంబమూర్తి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లేటికుర్తి రమేష్, మాజీ సర్పంచ్ వారిపల్లి నాగేశ్వరరావు, చిట్టిబాబు కొండలరావు, ముప్పల బుజ్జి, యూత్ అధ్యక్షుడు కర్రి నాయుడు ఉపాధ్యక్షుడు గడ్డం ఆనంద్ పాల్గొన్నారు.

కశింకోట: మంత్రి నారా లోకేష్ పుట్టిన రోజు వేడుకలు మండలంలోని జట్టపురెడ్డి తుని గ్రామంలో ఘనంగా జరిగాయి5. రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. టిడిపి నేతలు మజ్జి కుమార్, రమేష్, రమణారావు, ఎంపిటిసి షేక్ దర్గా పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని పెదనందిపల్లి గ్రామంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కేక్ కటింగ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు, పోతుల పాత్రు నాయుడు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ పిహెచ్‌సి ఆవరణలో నిర్వహించిన లోకేష్ జన్మదిన వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. పీహెచ్సీలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, టిడిపి నేతలు మహేష్, జూరెడ్డి రాము, రామనాయుడు పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక గౌరీ పరమేశ్వరుల దేవాలయంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కర్రి సాయి కృష్ణ 108 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ నాయకులు పెంటకోట విజయ్, ఆడారి మంజు, దాడి ముసలి నాయుడు, కడియం అనురాధ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండల వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్‌ను మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, నాగేశ్వరరావు కట్ చేశారు. విద్యార్థులకు భోజన వితరణ చేశారు. ఎంపీటీసీ పల్లి వెంకటరావు, కె వెంకునాయుడు, రెడ్డి నగేష్, సత్తిబాబు పాల్గొన్నారు.

అనకాపల్లి : లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా అనకాపల్లి గవరపాలెం జీవీఎంసీ గర్ల్స్ హైస్కూల్, జీవీఎంసీ చిన్న హై స్కూల్, టౌన్ గర్ల్స్ హైస్కూల్, భీమునిగుమ్మం జీవీఎంసీ హైస్కూల్, జీవీఎంసీ పెద్ద హైస్కూల్, గాంధీ నగరం జీవీఎంసీ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో గర్భిణులు, రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. బిఎస్ఎంకె జోగి నాయుడు, మళ్ళ సురేంద్ర, సబ్బవరపు గణేష్, బొద్దపు ప్రసాద్ పోలారపు త్రినాధ్ పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీష్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేశారు. 150 మంది పేదలకు నాగ జగదీష్ ఆర్థిక సహాయంతో చీరల పంపిణీ చేసారు. కార్యక్రమంలో కాండ్రేగుల సత్యనారాయణ, బోడి వెంకటరావు, విల్లూరి రమణబాబు, కాశి పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ :మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడులకను గురువారం టిడిపి జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ అధ్యక్షతన నిర్వహించారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ కేక్ కట్ చేశారు. అనంతరం రాష్ట్ర ఎన్టీఆర్ సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. కోరాడ రాజబాబు, అక్కరమాని విజయ నిర్మల, శ్రీనివాసరావు, భాస్కరరావు, పాల్గొన్నారు.

33 వ వార్డులో టిడిపి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, వార్డు క్లస్టర్ ఇన్‌ఛార్జి తిరుమల చక్రవర్తి ఆధ్వర్యాన అల్లిపురంలో నారా లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహి ళలకు, వృద్ధులకు, చీరలు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిఎస్‌కె వరప్రసాద్, భీశెట్టి శ్రీనివాసరావు, మాధవి పాల్గొన్నారు.

మునగపాకలో పూజలు చేస్తున్న నేతలు

ఎంవిపి కాలనీ : విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనాలో లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 400 మంది రక్తదానం చేశారు. మహిళలకు ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 62వ వార్డులో టిడిపి వార్డు అధ్యక్షులు మజ్జి మాలినాయుడు ఆధ్వర్యంలో మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. క్లస్టర్,బూత్ ఇన్‌ఛార్జిలతో కలిసి కేకు కట్ చేశారు. లోకేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

గాజువాక : 73వ వార్డులో తెలుగుయువత గాజువాక అధ్యక్షులు బలగ.బాలునాయుడు ఆధ్వర్యంలో.లోకేష్ పుట్టిన రోజు వేడుక నిర్వహించారు. వార్డులో పేద మహిళలు చీరలు, వృద్ధులకు బట్టలు పంపిఒణీ చేశారు. కార్యక్రమంలోవార్డు అధ్యక్షులు గోలగాని రమణ, మొల్లి ప్రకాష్, పంపన శ్రీను, ముత్యాలమ్మ, కురందాస్ కృష్ణ, అజయ్‌కుమార్, నాగిరెడ్డి నరసింహం, పీర్ బాబా, వరలక్ష్మి , జ్యోతి, ప్రమీల, రాణి ,సత్యప్రియ, ఈశ్వరి పాల్గొన్నారు ..

భీమునిపట్నం : రాష్ట్రమంత్రి నారా లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి యువ నేత గంటా రవి తేజ కేక్ కట్ చేశారు. పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, డిఎఎన్ రాజు, సంకురు భుక్త ప్రకాష్, గంటా నూకరాజు, పాసి త్రినాథ్ కుమార్, గొలగానినరేంద్ర కుమార్ జి వి నారాయణ పాల్గొన్నారు

విశాఖపట్నం లీగల్ : అక్కయ్యపాలెం ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో టిడిపి లీగల్ సెల్ ప్రెసిడెంట్ బత్తి రాజశేఖర్, రాష్ట్ర సెక్రటరీ శోభన్ బాబు ఆధ్వర్యంలో లోకేష్ పుట్టినరోజు వేడుకలు జరిగాయి. ఆశ్రమ వృద్ధులకు కిరాణా సామాన్లు, రగ్గులు అందజేశారు. టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిఎస్ నాయుడు, ఎస్ సతీష్ కుమార్, దుర్గాప్రసాద్, కన్నూరు అప్పలనాయుడు, రమేష్, శోభన్ బాబు పార్థసారథి, పల్లా బాలాజీ, భాస్కర్ పాల్గొన్నారు.

ఉక్కునగరం: జివిఎంసి 87వ వార్డు టిడిపి కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి, వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాథంఆధ్వర్యంలో లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. వార్డు అధ్యక్షులు రాజన్ రాజు, విజయరామరాజు, సత్తిబాబు, పావడ రమణమూర్తి, గెద్దాడ రాంబాబు, ఆనంద్ కుమార్, దేవుడు, ఎటిఎన్ మూర్తి, దాలయ్య, పాల్గొన్నారు.

ఆరిలోవ : .జివిఎంసి 10వ వార్డు పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్, వార్డు ఇన్‌చార్జ్ మద్దిలరాజశేఖర్, అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, రాజేష్ ఆధ్వర్యంలో, ఆదర్శనగర్‌లో వార్డు ప్రధాన కార్యదర్శి కేతా సత్యనారాయణ, బలగ సుధాకర్, తులసీ పార్వతి, రమణి ఆధ్వర్యలోనూ, 11వ వార్డు అధ్యక్ష, ఇన్‌ఛార్జిలు రాగతి అచ్యుతరావు, ముగడ రాజారావు, 13వ వార్డు మహిళా అధ్యక్షురాలు, కార్యదర్శి యల్లమిల్లి సురేష్ ఆధ్వర్యంలో మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.

ఎఎస్‌పి శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా విజయనగరం జిల్లా బొబ్బిలి సబ్ డివిజన్ డిఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న . శ్రీనివాసరావు నర్సీపట్నం సబ్ డివిజన్ ఎఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించారు. నర్సీపట్నం సబ్ డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ జి.ఆర్. ఆర్. మోహన్ నుండి బాధ్యతలు స్వీకరించారు. నర్సీపట్నం సబ్ డివిజన్ పోలీసు అధికారులతో పాటు సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి పి.శ్రీనివాస్ మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లాలో పనిచేసిన అనుభవం ఉన్నందున సబ్ డివిజన్ పరిధిలో ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. శాంతి భద్రతలను కాపాడి, గంజాయి అక్రమ రవాణాను నిరోధిస్తామన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎఎస్‌పి

ముందుగా ఏఎస్పీ శ్రీనివాసరావుకు నర్సీపట్నం పోలీస్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ముందుగా స్థానిక దుర్గా మల్లేశ్వర దేవాలయంలో పూజలు నిర్వహించారు.

మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యం

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ :మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా పనిచేస్తామని నర్సీపట్నం ఎఎస్‌పి పీ.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. యువత మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల బారిన పడవద్దని హితవు పలికారు. డ్రగ్స్‌తో జరిగే అనర్థాలపై ప్రజల్లో, యువతలో చైతన్యం తీసుకువస్తామని చెప్పారు. కృష్ణదేవిపేట, నర్సీపట్నం పోలీస్టేషన్లో తాను పని చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నర్సీపట్నంలో ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారిస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.నేరాల నియంత్రణలో ప్రజల సహకారం కూడా అవసరమని చెప్పారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంటలో ఫిబ్రవరి 5 నుంచి 7వ తేదీ వరకు శ్రీగౌరీపరమేశ్వరుల మహోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎంపిటిసి సుర్ల రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మూడు రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. అదే విధంగా నేల డ్యాన్స్‌లతో, కోలాటాలతో పాటు భారీ విద్యుత్ అలంకరణ చేయనున్నట్లు చెప్పారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి కొత్తపల్లి జలపాతం మూసివేత

ప్రజాశక్తి-పాడేరు :జి.మాడుగుల మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం కొత్తపల్లి జలపాతాన్ని ఈ నెల 24 తేదీ నుండి 27 వరకు మూసి వేయడం జరుగుతోందని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జల పాతం ఆధునీకరణ పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు .పర్యాటకులు గమనించి సహకరించాలని కోరారు. సుందరీకరణ అనంతరం ప్రవేశం కల్పిస్తామని చెప్పారు.

సుభాష్ చంద్రబోస్‌కు నివాళి

అనకాపల్లిలో నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి-గొలుగొండ:సుభాష్ చంద్రబోస్ అడుగుజాడల్లో ప్రజలందరూ నడవాలని హిమగిరి రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీ ఎం.సత్తిబాబు అన్నారు. గురువారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీ ఎం.సత్తిబాబు, కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీహరి తదితరులు మాట్లాడుతూ, దేశ స్వాంతంత్ర్యం కోసం అనేక ఉద్యమాలు చేశారన్నారు. ఆయన స్ఫూర్తిగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అదనపు ప్రిన్సిపాల్ రుత్తల గంగరాజు, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ సిహెచ్‌విఎస్‌ఆర్.ప్రసాద్, సనాతన సేవ ఫౌండేషన్ జిల్లా ఇంచార్జ్ సిహెచ్ మాలకొండయ్య, అల్లూరి జిల్లా బీజేపీ నాయకులు అరిమెల రాజు, కళాశాల అధ్యాపకులు అంకంరెడ్డి శ్రీనివాస్, గోవిందు, నాగేశ్వరి, రామకృష్ణ పాల్గొన్నారు.

అనకాపల్లి:స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి కార్యక్రమాన్ని స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జయబాబు పూలమాలను వేసి నివాళు లర్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.నిరంజన్ కుమార్, ఎన్‌సిసి ఆఫీసర్ ఏఎస్ఎన్ మూర్తి, ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ఆఫీసర్స్ సూరిబాబు, బిఎంవిపి నాయుడు, సూపరింటెండెంట్ పి.అనురాధ పాల్గొన్నారు.

కశింకోట : కశింకోటలోని నేతాజీ సుభాస్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, అప్పికొండ అప్పారావు, ఎంఎం.నాయుడు, రాంబాబు పాల్గొన్నారు.

చోడవరం రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన సుభాష్ చంద్రబోస్‌కు నివాళు లర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ సత్యవతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డి మాల్యాద్రి, డాక్టర్ రత్న భారతి, పిచ్చమ్మ, విఅప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట : జివిఎంసి 52వ వార్డు శాంతినగర్ డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో నేతాజీ చిత్ర పటానికి జియ్యాని శ్రీధర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సాధనకు నేతాజీ కృషిని కొనియాడారు.

పద్మనాభం : మండల పరిషత్ సమావేశమందిరంలో నేతాజీ చిత్రపటానికి ఇఒపిఆర్‌డి మీనా కుమారి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో నేతాజీ జయంతి జరిగింది. తమటపు నాగమణి, ఉప్పాడ అప్పారావు, రెడ్డిపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


గొలుగొండలో..

భీమునిపట్నం : మండలంలోని తాటితూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సుభాష్ చంద్ర బోస్ జయంతిని నిర్వహించారు. నేతాజీ జీవిత విశేషాలను హెచ్‌ఎం సన్యాసినాయుడు విద్యార్థులకు వివరించారు.

ములగాడ : స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాంఅధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి, తెలుగు లెక్చరర్ లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న నాయకులు

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ పంచాయతీ శివారు పేటమాలపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు మాట్లాడుతూ, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ఆరు లక్షలతో ఈ రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. గత పాలకులు గ్రామాల అభివృద్ధిని గాలి కొదిలేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంట్ ఎస్సీ సెల్ కార్యదర్శి శివ పాల్గొన్నారు.

'టిడిపి మండల కేడర్ పని తీరు మార్చుకోవాలి'

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండల టిడిపి కేడర్ పనితీరు మార్చుకోవాలని ఆ పార్టీ మండల కార్యనిర్వహణాధికారి బొడ్డు సత్యనారాయణ హెచ్చరించారు. మండలంలో వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల సమావేశాలు నిర్వహించేటప్పుడు హాజరు కావాలని తెలపాల్సిన బాధ్యత మండల కేడర్‌పై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టక ముందు కష్టపడ్డ టీడీపీ కార్యకర్తలను పక్కన పెట్టి తెరచాటు రాజకీయం చేసిన వ్యక్తులకే ప్రస్తుతం మండల క్యాడర్ పెద్దపీట వేస్తుందని ఆరోపించారు. పాకలపాడు క్లస్టర్ టిడిపి నాయకుడు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని తెలిపారు. గత నెలలో జరిగిన సాగునీటి సంఘ ఎన్నికల్లో సబ్బవరపు అచ్చియ్యమ్మ కుటుంబంపై వైసీపీ నాయకులు కార్యకర్తలు దౌర్జన్యం చేశారని, ఈ సంఘటనలో గాయపడ్డ ఆ కుటుంబానికి మండల కేడర్ అండగా ఉండాల్సింది పోయి పట్టీ పట్టనట్టు వ్యవహరించారని ఆరోపించారు.ఇలాగే జరిగితే వచ్చే స్థానిక ఎన్నికల్లో పలు ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. దీనిపై స్పీకర్ అయ్యన్న పాత్రుడుకి మండల నాయకత్వంపై ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు.

ఈ ఆఫీసు నిర్వహణపై ఎంపిడిఒలకు శిక్షణ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలోని మూడు మండలాల ఎంపిడిఒలకు, పరిపాలన అధికారులకు గురువారం విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఈ ఆఫీస్ నిర్వహణ, కార్యాలయ రికార్డులు, అందుబాటులో ఉన్న నిధుల వినియోగం, సాంకేతిక అంశాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రజా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి అధ్యక్షతన ఉప కార్యనిర్వహణాధికారి కె.రాజ్‌కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఇఒ నారాయణమూర్తి మాట్లాడుతూ, ఖచ్చితమైన రికార్డుల నిర్వహణ ప్రాముఖ్యతపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఉప కార్య నిర్వహణ అధికారి రాజ్ కుమార్ మాట్లాడుతూ, మండల స్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి, అభివృద్ధి పనులను వేగవంతం చేసి అందుబాటులో వున్న నిధులను ఆర్థిక సంవత్సరం ముగిసేలోగ ఖర్చు చేయవలసిందిగా మార్గనిర్దేశం చేశారు.

డిసిటిఓ శ్వేత పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జిఎస్‌టిపై అవగాహన కల్పించారు. సజావుగా, సమర్థంగా చెల్లింపుల కోసం ఈ-గ్రామ్ స్వరాజ్ ప్లాట్ ఫామ్ ద్వారా అభివృద్ధి ప్రణాళికలలో పొందుపరచిన పనులను ఆయా కేటాయింపులకు అనుగుణముగా ఖర్చు చేయుటకు, ప్రభుత్వ సాంకేతిక వనరులను ఉపయోగించుకోవడంపై పిపిటి ద్వారా సమగ్ర శిక్షణ ఇచ్చారు.

నిర్వాసిత గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల భవనం నిర్మాణంకు భూములు ఇచ్చిన తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధిత గిరిజనులు గురువారం నిర్మాణం చేపడుతున్న పాఠశాల భవనం ఎదుట కంచెను వేసి నిరసన ఆందోళన చేపట్టారు. ఉపాధి కల్పిస్తామని చెప్పడంతో సాగు చేసుకుంటున్న భూములను ఇచ్చామన్నారు. ఇప్పటికి తమకు ఎటువంటి ఉద్యోగం పాఠశాలలో కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

చలిసింగం గ్రామానికి త్వరలో రహదారి సదుపాయం

-కలెక్టర్ విజయకృష్ణన్ -ఫలించిన సిపిఎం, గిరిజన సంఘాల పోరాటం

ప్రజాశక్తి- కొత్తకోట:గత ఐదేళ్ళు గా సిపిఎం, గిరిజన సంఘాలు చేసిన పోరాట ఫలితంగా రావికమతం మండలం చీమలపాడు శివారు చలి సింగం గ్రామానికి త్వరలో రహదారి సౌకర్యం కలగనుంది. ఫారెస్ట్ అనుమతులు లేక గత పదేళ్లుగా నిలిచిన రహదారి నిర్మాణానికి జిల్లా కలెక్టర్ తో ఫారెస్టు అధికారులు పచ్చ జెండా ఊపారు. గురువారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చలిసింగం గ్రామాన్ని సందర్శించారు. కొండ శివారు లో ఉన్న ఈ గిరిజన గ్రామంలో సుమారు 180 కుటుంబాలలో 500 మందికి పైగా జనాభా ఉన్నారు. ఈ గ్రామానికి రహదారి సౌకర్యం లేక అక్కడి గిరిజనులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని పలు సందర్భాల్లో సిపిఎం, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పలు మార్లు వివిధ దశల్లో నిరసనలు చేపట్టారు. గత సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద డోలి లతో నిరసన చేశారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, ఇతర యంత్రాంగం గురువారం మైదాన ప్రాంతానికి సుమారు నాలుగు కిలోమీటర్లు దూరంలో కొండ పై ఉన్న చలి సింగం గ్రామంలో పర్యటించారు.జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తో పాటు జిల్లా ఫారెస్టు అధికారి ఎం. శ్యామ్యూల్, చోడవరం ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు, జన సేన ఇన్ ఛార్జ్ పివి ఎస్ ఎన్ రాజులు కాలి నడకన నడుచుకుంటూ చలిసింగం గ్రామానికి చేరుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సమస్యను తెలుసుకునేందుకే కాలి నడక ప్రయాణం సాగించానని, ప్రతిరోజు ఆదివాసి బిడ్డలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్నామన్నారు. త్వరలో రహదారి పనులు ప్రారంబిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా గ్రామస్తులు చీపురు వరాలమ్మ, చీపురు శంకర్రావు, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె గోవిందరావు మాట్లాడుతూ, చలిసింగం కొండ శిఖర గ్రామంలో వర్షం పడితే వారం రోజుల పాటు విద్యుత్ సౌకర్యం ఉండదన్నారు. తాగు నీటి సౌకర్యం లేక బురద నీళ్ల తాగుతున్నా మని చెప్పారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రావికమతం తహసీల్దార్ వెంకటరమణ, ఎంపిడివో వెంకన్న, గ్రామ సర్పంచ్ వి. గంగరాజు, టిడిపి మండల శాఖ అధ్యక్షులు రాజాన కొండ నాయుడు, చోడవరం టిడిపి మహిళా అధ్యక్షులు కోట నీలవేణి గోవిందరావు, కెవిపిఎస్ జిల్లా నాయకులు పూడి అర్జున రావు తదితరులు పాల్గొన్నారు..

గిరిజన సమస్యలపై కలెక్టర్‌కు వినతి

కాలినడకన వెళుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం లోసింగి గ్రామాన్ని గురువారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సందర్శించారు. ఈ మేరకు గిరిజనులు సమస్యలపై సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే.గోవిందరావు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. లోసింగి రెవెన్యూ పరిధిలో పిత్రిగెడ్డ, పెదగరువు, పాతలోసింగి పీవీటీజీ గిరిజనులకు జగనన్న కాలనీలో 41 మందికి పట్టాలు ఇచ్చారని, అయితే రోడ్డు సౌకర్యం లేక నిర్మాణాలు చేయలేదన్నారు. ప్రస్తుతం రోడ్డు పనులు ప్రారంభం కావడంతో వీరికి ఎన్టీఆర్ హౌసింగ్ స్కీమ్, పెదగరువు, కొత్తలోసింగి గ్రామాల్లో ఆర్ఓఆర్ఎఫ్ పట్టాలు ఇప్పించాలని కోరారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు..ప్యాకేజీ శాశ్వత పరిష్కారం కాదు

సిబిఐ మాజీ జేడీ వివి.లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి -ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్ కేంద్రం ప్రకటించిన ప్యాకేజీ ఉక్కు పరిరక్షణకు శాశ్వత పరిష్కారం కాదని సిబిఐ మాజీ జేడీ వివి. లక్ష్మీనారాయణ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు గురువారం నాటికి 1442వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరాన్ని లక్ష్మీనారాయణ సందర్శించి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీని సరైన విధంగా వినియోగించుకుంటే కొంతవరకు ఉపయుక్తం అవుతుందన్నారు. సెయిల్‌లో విలీనం చేసి, గనులు కేటాయిస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. నిర్వాసితులకు న్యాయం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇవ్వాలన్నారు. అమరావతి నిర్మాణాలకు స్టీల్‌ప్లాంట్‌లో తయారయ్యే స్టీల్ కొనాలని ప్రభుత్వాన్ని కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ భూములు రాష్ట్రపతి పేరు మీద ఉన్నాయని, దాన్ని వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పేరుకు ట్రాన్స్‌ఫర్ చేస్తే రూ.75 వేల కోట్లు లోను తీసుకోవచ్చని చెప్పారు.

2021 నుంచి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వ వివక్ష వల్ల వందలాది మంది కార్మికులు రిజైన్ చేసి వెళ్లిపోయారని, ఇప్పుడు విఆర్ఎస్ ద్వారా 700 మంది వెళ్లిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి 3000 మంది రిటైర్ అవుతున్నారని, ప్లాంట్ పూర్తిస్థాయిలో ఉత్పత్తి తీయాలంటే నియామకాలు జరగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్,

దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

వరసాల శ్రీనివాసరావు, దాసరి సురేష్‌బాబు, బిఎన్.రాజు, నీరుకొండ రామచంద్రరావు, కెఎస్ఎన్.రావు, డేవిడ్, దొమ్మేటి అప్పడు, కారు రమణ, దాసరి శ్రీనివాస్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక రంగంలో మోడల్ సిటీగా విశాఖ

ఎపిటిడిసి ఎమ్‌డి ఆమ్రపాలి

సమీక్ష నిర్వహిస్తున్న ఆమ్రపాలి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ప్రపంచ స్థాయి ప్రమాణాలు పాటిస్తూ విశాఖపట్టణంలో పర్యాటకపరమైన అవకాశాలను కల్పించాలని, ఆ రంగంలో విశాఖను మోడల్ సిటిగా తీర్చిదిద్దాలని రాష్ట్ర టూరిజం శాఖ ఎమ్‌డి ఆమ్రపాలి సూచించారు. పర్యాటక ప్రాజెక్టులు, ప్రణాళికల రూపకల్పన, మౌలిక వసతుల ఏర్పాటు, భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలపై సిరిపురంలోని విఎంఆర్‌డిఎ మీటింగు హాలులో టూరిజం, పోర్టు, విఎంఆర్‌డిఎ, జివిఎంసి, జిసిసి, అటవీ శాఖ, జూ, వివిధ ప్రయివేటు స్పోర్ట్స్ కాంప్లెక్సుల ప్రతినిధులు, హోటళ్ల నిర్వాహకులు, టూరిజం కౌన్సిల్ సభ్యులతో గురువారం ఆమె ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్రూయిజ్ టూరిజానికి సంబంధించి పోర్టు ఆధ్వర్యాన ప్రత్యేక టెర్మినల్స్ నిర్మించాలని, దానికి తగ్గ వసతులు సమకూర్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇప్పుడున్న బీచ్‌లకు అనుబంధంగా అదనపు బీచ్‌లను అభివృద్ధి చేయాలని, దానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. కంబాలకొండ, గంభీరం, తాటిపూడి రిజర్వాయర్లలో బోటింగ్ అవకాశాలపై దృష్టి సారించాలని, జూ పార్కులో అదనపు హంగులు కల్పించాలని సూచించారు. కొత్త ప్రాజెక్టుల రూపకల్పనకు సంబంధించి అందరికీ ఆమోదయోగ్యమైన ప్రణాళికలు రూపొందించాలని, బడ్జెట్ ప్రతిపాదనలు పంపించాలని పేర్కొన్నారు. డిపిఆర్‌లు, స్థానిక అవకాశాలకు అనుగుణంగా రాష్ట్ర స్థాయి నుంచి సహకారం అందిస్తామని చెప్పారు. విఎంఆర్‌డిఎ పరిధిలో ఇప్పటికే నడుస్తున్న ప్రాజెక్టులు, భవిష్యత్తులో చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ పిపిటి ద్వారా వివరించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని పిపిపి విధానంలో పలు ప్రాజెక్టులు చేపట్టనున్నామని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ సమావేశాల నిర్వహణ, బహుళ ప్రయోజనాల దృష్ట్యా సుమారు 15 నుంచి 20 ఎకరాల విస్తీర్ణంలో ఐదు వేల మందికి సరిపడేలా అతిపెద్ద మల్టీ మోడల్ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించినట్లు కమిషనర్ వివరించారు. కొండప్రాంతాల్లో ఎకో టూరిజం రిసార్టులు, తాటిపూడి, గంభీరం లాంటి ప్రాంతాల్లో బోటుక్లబ్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మెగా అమ్యూజ్‌మెంట్ పార్కును నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. అడ్వెంచర్, టెంపుల్, బీచ్, కల్చరల్, ఎకో, వైల్డ్ లైఫ్, మెడికల్, తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో జిల్లా టూరిజం అధికారి జ్ఞానవేణి, డివిఎం జగదీష్, ప్రయివేటు సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.